# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :97 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 08-06-2024 | పేజీలు:4 వెల: 2.00


## ఆరు నెలల్లోనే కాంగ్రెస్ విఫలం


హైదరాబాద్, తెలంగాణలో కాంగ్రెస్ ఆరు నెలల పాలన విఫలమైందని బీఆర్ఎస్ నాయకుడు ఎర్రోళ్ల శ్రీనివాస్ ధ్వజమెత్తారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల విషయంలో బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌కు చేతకాక బీఆర్ఎస్ మీద ఆరోపణలు చేస్తున్నారు. కొడంగల్‌లో కాంగ్రెస్ పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లకు పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఓట్లకు తేడా ఉందన్నారు. రేవంత్ రెడ్డికి వచ్చిన ఓట్లలో 24 వేలు బీజేపీకి వెళ్లాయి. సీఎం సొంత జిల్లాలో బీజేపీని గెలిపించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావుకు వచ్చిన ఓట్లు ఎవరికి పడ్డాయి. 18 నుంచి 20 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ సీట్లలో ఓట్లు ఎందుకు తగ్గాయి. రేవంత్ రెడ్డి పరిపాలన బాగుంటే 16 సీట్లు గెలిచేవాళ్లు కదా..? రేవంత్ సిట్టింగ్ సీటు మల్కాజ్‌గిరిలో కాంగ్రెస్ ఓడిపోయింది. ప్రజల తీర్పుని శిరసావహిస్తాం. కాంగ్రెస్ నేతలు ఎందుకంత మిడిసిపడుతున్నారు.

## యుద్ధ ప్రాతిపదికన బ్యారేజీల మరమ్మతులు..



పెద్దపల్లి,కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీల వద్ద మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లాలోని సుందిల్ల బ్యారేజీ వద్ద మరమ్మతు పనులను అధికారులతో కలిసి పర్యవేక్షించారు.అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వం నాసిరకంగా నిర్మించడం వల్ల మేడిగడ్డ బ్యారేజీ కుంగిన విషయం ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. ప్రాజెక్టు మరమ్మతులను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, తాము అధికారంలోకి రాగానే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులకు ప్రాజెక్టును సందర్శించి ఎంత మేర డ్యామేజీ జరిగిందో పరిశీలించి ప్రాజెక్టు రక్షణ కోసం చేపట్టాల్సిన పనులపై రిపోర్టు ఇవ్వాలని కోరామన్నారు.ఎన్‌డీఎస్ అధికారులు ప్రాజెక్టును పరిశీలించి ఇంటీరియం రిపోర్టు అందజేశారన్నారు. వారి సూచన మేరకు 3 ఏజెన్సీలకు పనులు అప్పగించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేయాలని ఆదేశించామన్నారు. ఈ సీజన్‌కు నీరందించేలా పనులు చేపట్టామని, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన తప్పిదాలను తెలుసుకునేందుకు జస్టిస్ ఘోష్ కమిషన్ బ్యారేజీ సందర్శనకు వస్తుందన్నారు. తమ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా తమ్మిడిహెట్టి ప్రాజెక్టు తప్పనిసరిగా నిర్మిస్తామన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తోపాటు పలు శాఖ అధికారులు, కాంగ్రెస్ ప్రజాప్రతి నిధులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

## ఎన్డీఏ కూటమి సమావేశం వేళ కలకలం..



న్యూఢిల్లీ,పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో (పార్లమెంట్ కాంప్లెక్స్) ఎన్డీఏ కూటమి సమావేశం జరగనున్న విషయం తెలిసిందే. ఈ సమావేశానికి ముందు అక్కడ అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. కొంతమంది నకిలీ ఆధార్ కార్డులతో పార్లమెంట్‌లోకి ప్రవేశించేందుకు విఫల యత్నం చేశారు. ప్రస్తుతం కూటమి సమావేశం వేళ ఈ ఘటన తీవ్ర కలకలం రేపుతోంది.శుక్రవారం ఉదయం ముగ్గురు వ్యక్తులు నకిలీ ఆధార్ కార్డులు (నకిలీ ఆధార్ కార్డులు) సాయంతో పార్లమెంట్ భవనం గేట్ నంబర్ 3 ద్వారా లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. వారి కదలికలు అనుమానాస్పదంగా ఉండటంతో భద్రతా సిబ్బంది వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు నిందితులు కాసిం, మోనిస్, సోయెబ్‌లుగా గుర్తించారు. వీరు ఉత్తరప్రదేశ్‌కు చెందిన కూలీలుగా విచారణలో తేలింది. ఈ మేరకు ముగ్గురిని అరెస్ట్ చేసి ఫోర్జరీ, మోసం కింద కేసులు బుక్ చేశారు. అరెస్టైన ముగ్గురు వ్యక్తులు పార్లమెంట్ కాంప్లెక్స్‌లో ఎంపీ లాంజ్‌ను నిర్మించేందుకు కాంట్రాక్ట్ తీసుకున్న డీ వీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్‌లో పనిచేస్తున్నట్లు సమాచారం.కాగా, నూతనంగా ఎన్నికైన ఎంపీలతో బీజేపీని ఎన్డీయే ఇవాళ ఉదయం పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి ఎన్డీయే భాగస్వామ్య పక్షాలకు చెందిన ఎంపీలు హాజరు కానున్నారు. కూటమి ముందస్తు ప్రభుత్వ ఏర్పాటుపై ఈ ప్రాథమికంగా చర్చిస్తారు. లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ కేవలం 240 సీట్లకే పరిమితం కావడంతో జేడీయూ, టీడీపీ సహా భాగ స్వామ్య పార్టీల తోడ్పాటు అనివార్యమైంది. ఈ సమావేశంలో ఎన్డీఏ పక్ష నేతగా మోదీని ఏకగ్రీవంగా ఎన్నుకోనున్నారు. అనంతరం ఎన్డీఏ పక్ష నేతలను ఉద్దేశించి పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు. రాత్రి 7 గంటలకు ఎన్డీయే కూటమి నేతలు రాష్ట్రపతిని కలవనున్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని రాష్ట్రపతికి ఎన్డీఏ ఎంపీలు సంతకాలతో కూడిన లేఖను ఇవ్వనున్నారు. జూన్ 9 సాయంత్రం 6 గంటలకు భారత ప్రధానిగా మూడోసారి మోదీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

## గ్రూప్–1 పరీక్షలకు సర్వం సిద్ధం....



వికారాబాద్, గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జూన్ 9న నిర్వహించే గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి చేపట్టాల్సిన విధి విధానాలపై ఐడెంటిఫికేషన్ అధికారులు, శాఖపరమైన అధికారులు, పరీక్ష నిర్వహణ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ%ొ%. జిల్లాలో గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షలో ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా, అతి జాగ్రత్తగా పరీక్ష నిర్వహించాలన్నారు. పరీక్ష విధులు నిర్వహించే అధికారులు సమన్వయతో పని చేయాలని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్తు, టాయిలెట్స్, త్రాగునీరు ఉండే విధంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. రూట్ అధికారులు తమ లోకేషన్లను ముందస్తుగానే చూసుకోవాలని, శాఖ అధికారులు పరీక్ష కేంద్రాలను క్షేత్రస్థాయిలో వెళ్లి పర్యవేక్షించాలని ఆయన తెలిపారు.ఐడెంటిఫికేషన్ అధికారులు అభ్యర్థి హాల్ టికెట్, ఫోటోను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు తమ విధులను సక్రమంగా నిర్వహించేందుకు సమావేశం ఏర్పాటు చేసుకొని ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. పరీక్ష సమయంలో ఎలాంటి తప్పులు జరిగిన సంబంధిత అధికా రులపై చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. పూర్తి పోలీసు బందోబ స్తు మధ్య పరీక్ష నిర్వహణకు చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణా కార్యక్రమంలో అదనపు కలెక్టర్ తో పాటు టీజీపీఎస్సీ రీజనల్ కోఆర్డినేటర్ రాజేష్ ఉన్నారు.

## చత్తీస్ గఢ్ తరలిస్తున్న తెలంగాణ యూరియా



వాజేడు, తెలంగాణ రాష్ట్ర యూరియాను చత్తీస్ గఢ్ రాష్ట్రానికి తరలించి అక్రమంగా యూరియా వ్యాపారం కొనసాగిస్తున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. అనుముల ఏజెన్సీ ప్రాంతమైన ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని చెరుకూరు కేంద్రంగా ఈ అక్రమ యూరియా దందా గత కొద్ది రోజులుగా కొనసాగుతుంది. అక్రమ యూరియా వ్యాపారాన్ని అరికట్టాల్సిన సంబంధిత శాఖ అధికారులు మౌనం వహించడంతో వారి వ్యాపారానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. వాజేడు మండలంలో 272 రూపాయలు ఉన్న యూరియా బస్తా చతిస్ గఢ్ రాష్ట్రంలో 450 రూపాయల నుండి 500 రూపాయల ధరకు విక్రయిస్తున్నారు.చెరుకూరులోని వివిధ ఫెర్టిలైజర్ షాపుల వద్ద నుండి చత్తీస్ గఢ్ కు వందలాది ట్రాక్టర్ బోలేరా లోడ్లు ప్రతిరోజు అక్రమంగా తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు నోరు మెదపకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులు సైతం అంతగా పట్టించుకోకపోవడంతో ఫెర్టిలైజర్ వ్యాపారుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. గత ఏడాది సైతం ఇలాగే తెలంగాణ యూరియాను చత్తీస్ గఢ్ కు తరలిస్తే ఇక్కడి రైతులకు యూరియా కొరత ఏర్పడి రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఎలాంటి పర్మిట్ పేపర్లు లేకుండా అక్రమంగా యూరియా బస్తాల లోడ్లను చత్తీస్ గఢ్ రాష్ట్రానికి తరలిస్తూ లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నారు. ఒకవైపు వ్యవసాయ శాఖ మంత్రి నకిలీ విత్తనాల విక్రయాలు జరగకుండా తగు చర్యలు చేపట్టాలని అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ ఇక్కడి అధికారులు మంత్రి ఆదేశాలను బేఖాతర్ చేస్తూ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి తెలంగాణ రాష్ట్రం నుండి చత్తీస్ గఢ్ కు యూరియాను తరలిస్తున్న వ్యాపారులపై తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ ప్రాంత రైతాంగం కోరుతున్నారు.

## మోడీ ఏక ఛత్రాధిపత్యానికి ఇక చెక్



న్యూఢిల్లీ,దేశంలో అప్రతిహత నేతగా, తిరుగులేని నేతగా గణతికెక్కిన నరేంద్ర మోడీ ప్రధానిగా మనుగడ కోసం ఇతరులపై ఆధారపడవలసిన స్థితి వచ్చింది. భారత ప్రజాస్వామిక చైతన్యం కారణంగానే ఇలా జరిగింది. ఎంతటి వారైనా ప్రజల ముందు దిగదుడుపే అని నిరూపించిన సదర్భం ఇది. మోడీనే మోసి అలసిపోయిన బిజెపి నేతలకు కలలోనైనా ఊహించలేని పరిణామం ఇది. దేశవ్యాపితంగా ఏ ఒక్క ఎగ్జిట్ పోల్ కూడ చెప్పని స్థాయి లోకి ఆయనను, ఆయన పార్టీని పడగొట్టిన శక్తి ప్రజలదే. ప్రజలను కలవకుండా, ప్రతిపక్షాలతో చర్చించకుండా, పార్టీకి చెప్పకుండా తనకుతోచిన విధంగా ముందుకు సాగుతున్న తీరును ప్రజలు ఈసడించుకున్నారు.ఇక ఈ ఎన్నికల్లో మరో కీలక పరిణామం బిఆర్ఎస్, బిఎస్‌పి రాజకీయ చిత్రం నుంచి అదృశ్యమయ్యాయి. బిఆర్ఎస్‌గా మారి దేశ రాజకీయాలనే ప్రభావితం చేస్తామన్న కెసిఆర్ స్వంత నియోజకవర్గం లాంటి మెదక్ కూడా గెలవలేకపోయారు. అన్నాడిఎంకె కూడా మొత్తంగా మాయమైపోయింది. ఒడిషాలో బిజెడి కూడా బిజెపి విషయంలో ఊగిసలాడి చివరకు అధికారం పోగొట్టుకోవడమే గాక లోక్‌సభ ప్రాతినిధ్యం కూడా పోగొట్టుకుంది. ఉద్యమాలకూ ఎన్నికలకూ సంబంధం వుండదనే సిద్ధాంతాలు కూడా ఈ ఫలితాలతో తారుమారైనాయి. రైతాంగ ఉద్యమం నడిచిన చోట్ల బిజెపికి తీవ్రమైన దెబ్బ తగిలింది. మొత్తంగా వాతావరణంలో మార్పు తేవడంలోనూ ఆ ప్రభావం పడింది. రాజస్థాన్, హర్యానా, పంజాబ్, యు.పి, పశ్చిమ ప్రాంతంలో బిజెపి ఓటమికి ఈ ఉద్యమమే కారణంగా భావిస్తున్నారు. రాజ్యాంగం, రిజర్వేషన్లు, ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం వంటి అంశాలను చర్చలోకి తేవడానికి ఆ వర్గాలను ఆకర్షించడానికి కారణమైనాయి. మైనార్టీలలో వచ్చిన మార్పు యు.పి ఫలితంలో కీలక పాత్ర వహించింది. ఏక వ్యక్తి కేంద్రంగా పని చేసే మోడీ మిశ్రమ ప్రభుత్వాన్ని నడపగలరా అనే సందేహాలు కూడా మీడియా బాహాటంగానే వ్యక్తం చేసింది. కార్పొరేట్ శక్తులు తమ ప్రయోజనాల కోసం ఎంతైనా ఒత్తిడి తెస్తుంటాయి. భారత రాజ్యాంగ రక్షణ అనే అంశాన్ని కేంద్ర బిందువుగా చేసుకుని కాంగ్రెస్ చేసిన ప్రచారాన్ని ప్రజలు బలంగా నమ్మారు. దేశ చిత్రపటాన్ని మోడీ ముఖచిత్రంగా మార్చేసిన వైపరీత్యానికి తెర దిగింది. ఓ రకంగా చెప్పాలంటే పార్లమెంటులో ప్రజల తీర్పు మోడీ నైతిక పరాజయంగా చూడాలి. ఫాసిస్టు తరహా పాలనకు వ్యతిరేకంగా ప్రజల తీర్పుగా దీన్ని చూడాలి. దేశంలో ప్రజాస్వామిక విలువలను గౌరవించాలని తేల్చిచెప్పారు. ఇండియా' వేదికలో 99 స్థానాలతో కాంగ్రెస్ దాదాపు 40 శాతం ఆధిక్యాన్ని ప్రదర్శించింది. ఈ విధమైన పరిస్థితి వస్తుందని కమలనాథులు ముందుగా ఊహించలేదంటే వారు నేలవిడిచి సాము చేశారని చెప్పాలి. రాజ్యాంగం రాష్ట్రాల హక్కులు, లౌకిక తత్వం, రైతాంగ ఉద్యమాలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అంశాలు కాకుండా కేవలం వ్యక్తిగతమైన, ఉద్వేగ భరితమైన అంశాలే ఓటర్లను నడిపిస్తాయనే అంచనాతో ఎన్నికల్లోకి వెళ్లిన బిజెపిని గట్టి దెబ్బ కొట్టారు. ఓటర్ల తీర్పు చూస్తే ఇవన్నీ ప్రభావం చూపించాయని అర్థమవుతుంది. త్తరాన, పశ్చిమాన బిజెపి ప్రాబల్యం తగ్గలేదనీ దక్షిణాన, తూర్పున మాత్రమే ఇతరుల ప్రభావం అధికమని భావింఇన వారికి కూడా ఈ ఫలితాలు చెంపదెబ్బలాంటివి. ఉత్తర భారతంలో మోడీ స్వయంగా పోటీ చేయడమే గాక ఆయనతో దీటైన ప్రధాని అభ్యర్థిగా చలామణి అయ్యే యోగి ఆదిత్యనాథ్ పాలించే యు.పి లో బిజెపి ఘోరంగా దెబ్బతిన్నది. అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ట ప్రచారం, ప్రతిపక్షాలు వ్యతిరేకమనే ముద్ర ఆదుకోలేక పోయింది. యు.పి లో ప్రతిపక్షాల ముందు బిజెపి నిలువలేకపోయింది. గతంలో దానికి స్వంతంగా 62 స్థానాలు వస్తే ఈ సారి 33కు పడిపోయాయి. గతంలో అయిదు స్థానాలే వచ్చిన ఎస్.పి ఇప్పుడు 37తో మొదటి స్థానంలోకి వచ్చింది.ములాయం మరణానంతరం అఖిలేష్ యాదవ్ నాయకత్వంలో ఇదే పెద్ద విజయం. బిఎస్‌పి వేరుగా పోటీ పెట్టి పూర్తిగా ఓడిపోయినా దాని వల్లనే 16 స్థానాలు బిజెపికి పోయాయి. లేకపోతే ఈ సంఖ్య మరింత అధికంగా వుండేది. బీహార్‌లోనూ కొంత ఫలితం వచ్చింది. ఇక బిజెపి కుట్రలతో ప్రలోభాలతో ప్రాంతీయ పార్టీలన్నిటినీ చీల్చిన మహారాష్ట్రలో శివసేన, ఎన్‌సిపి, కాంగ్రెస్ కూటమి పైచేయి సాధించి సీట్లు తెచ్చుకున్నది. బిజెపి 9 సీట్లకు పరిమితమైంది. మొత్తంపైన గతంలో దక్షిణాన 30 సీట్లు వుంటే ఇప్పుడు 41కి చేరాయి. మరో వంక 'ఇండియా' కు గతంలో 58 వుంటే ఇప్పుడు 74కు చేరాయి. ఇక తూర్పున ఒడిషాలో అధికారం, ఆధిక్యత రెండూ దక్కినా బెంగాల్‌లో బిజెపి గతంలోని స్థానాలు 12కు తగ్గాయి. మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, గుజరాత్ లలో బిజెపితో ముఖాముఖి పోటీలో కాంగ్రెస్ స్థానాలు గతంలో కంటే బాగానే పెరిగాయి. రాహుల్ గాంధీ యాత్రలు, కార్యక్రమాలు పార్టీలో కదలిక తేవడమే గాక ఆప్ కూడా కూటమితో కలసి రావడం తోడైంది. బీహార్‌లో ఆర్జెడి కూడా ముఖ్య పాత్ర వహించింది.ఈ విధంగా మొత్తంపైన ఎవరూ ఊహించని విధంగా 'ఇండియా' వేదిక బిజెపి,ఎన్‌డిఎకు దీటుగా నిలిచిందంటే ప్రజల మద్దతే కారణం.

### పరుగులు పెడుతున్న బంగారం వెండి ధరలు

హైదరాబాద్,యూఎస్‌లో జాబ్ డేటా తర్వాత పేరోల్ డేటా ఫోకస్‌లోకి రావడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి పరుగు కొనసాగుతోంది. ప్రస్తుతం, ఔన్స్ బంగారం ధర 2,391 డాలర్ల వద్ద ఉంది. మన దేశంలోనూ కళ్లెం లేని గుర్రంలా బంగారం పరుగులు పెడుతోంది. ఈ రోజు 10 గ్రాముల ఆర్నమెంట్ బంగారం (24 కేరెట్లు) ధర 770 రూపాయలు, స్వచ్ఛమైన పసిడి (22 కేరెట్లు) ధర 700 రూపాయలు, 18 కేరెట్ల గోల్డ్ రేటు 570 రూపాయల చొప్పున పెరిగాయి.

## ఎన్డీఏ బంధం విడదీయరానిది.. నమ్మకమే దానికి పునాది



న్యూఢిల్లీ: ఎన్డీఏ కూటమి మధ్య బంధం బలోపేతం కావడానికి న'మ్మ'క'మే కీలక'మైంద'ని ప్రధాని మోదీ అన్నారు. ఇవాళ పార్లమెంట్‌హాల్‌లో జరిగిన ఎన్డీఏ కూటమి మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఎన్డీఏ పక్ష నేతగా మోదీని ఎన్నుకున్న తర్వాత ఆయన ప్రసంగించారు. ఎన్డీఏ నేతగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం అదృష్టవంతుడిగా భావిస్తున్నట్లు ప్రధాని మోదీ అన్నారు. మీరందరూ కొత్త బాధ్యతను అప్పగించని, దానికి కృతజ్ఞతుడినై ఉంటానన్నారు. 2019లో ఇదే సభలో మాట్లాడుతున్న సమయంలో.. అప్పుడు కూడా తనను లీడర్‌గా ఎన్నుకున్నారని, ఆ సమయంలో నమ్మకం ఎంత బలమైందన్న విషయాన్ని చెప్పానని గుర్తు చేశారు. ఇప్పుడు మీరు అందజేస్తున్న బాధ్యత కూడా ఆ బంధం నుంచి పుట్టిందన్నారు. మన మధ్య ఉన్న విశ్వాస బంధం మరింత బలోపేతంగా మారిందన్నారు. ఈ బంధం ఓ బలమైన పునాది మీద ఏర్పడింది. ఇదే అతిపెద్ద అసెట్ అని ఆయన చెప్పారు.

### ఎన్డీయే పక్షనేతగా మోదీ ఏకగ్రీవ ఎన్నిక.. పార్లమెంట్ వెలుపల కార్యకర్తల సంబరాలు

నరేంద్ర మోడీ ఎ మరో రెండు రోజుల్లో కొత్త ప్రభుత్వం కొలువుతీరబోతోంది. నరేంద్ర మోదీ (నరేంద్ర మోదీ) ఎన్డీయే కూటమి ముచ్చటగా మూడోసారి అధికారం చేపట్టబోతోంది. నరేంద్ర మోదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు.ఈ సందర్భంగా నేడు ఎన్డీయే కూటమి నేతలు ఢిల్లీలోని పాత పార్లమెంట్ భవనంలో సమావేశమైన ఎన్డీయే పక్ష నేత (పార్లమెంటరీ పార్టీ నాయకుడు) నరేంద్ర మోదీ (నరేంద్ర మోదీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో బీజేపీ కార్యకర్తలు, మద్దతుదారులు సంబరాలు చేసుకున్నారు (%దీజీ% కార్యకర్తల వేడుకలు). బీజేపీ జెండాలను చేతని పార్లమెంట్ వెలుపల టపాసులు పేలుస్తూ సంబరాలు చేసుకున్నారు. డబ్బు వాయిద్యాలు, డ్యాన్సులతో సందడి చేశారు. మూడోసారి ప్రధాన మంత్రిగా మోదీ బాధ్యతలు చేపట్టబోతుండటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

## ప్రధాని మోదీకి సంకీర్ణాన్ని నడిపే లక్షణాలు లేవు




న్యూఢిల్లీ,ప్రధాని నరేంద్రమోదీకి సంకీర్ణ సర్కారును నడిపే లక్షణాలు లేవని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గౌరవ్ గొగోయ్ అన్నారు. ఆయన వచ్చే ఐదేళ్లలో పూర్తికాలం ప్రధానిగా కొనసాగడం సందేహాస్పదమే అని గొగోయ్ సంకీర్ణ సర్కారును నడిపించడం అంత సులువు కాదని అభిప్రాయపడ్డారు.సంకీర్ణ సర్కారును పూర్తికాలం నడపాలంటే విశాల హృదయం ఉండాలని, ఎదుటివారి అభిప్రాయాలను ఓర్పుగా వినే మనసు ఉండాలని, అందరినీ కలుపుకుపోయే మనస్తత్వం ఉండాలని గౌరవ్ గొగోయ్ చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీలో ఈ లక్షణాలేవి లేవని ఆయన ఉన్నారు.ప్రధాని నరేంద్రమోదీ సుదీర్ఘకాలం ప్రధానిగా ఎలా కొనసాగారో అర్థం కావడం లేదని గౌరవ్ గొగోయ్ అన్నారు. మోదీ కంటే రాహుల్‌గాంధీకి ఎక్కువ లోక్‌సభ స్థానాలు కట్టబెట్టిన ఉత్తరప్రదేశ్ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. వారణాసిలో మోదీకి వచ్చిన మెజారిటీ డబుల్ మెజారిటీ రాయ్‌బరేలీలో రాహుల్‌గాంధీకి వచ్చింది.మోదీ ప్రధానిగా పనిచేసిన రెండు పర్యాయాలు బీజేపీకి స్పష్టమైన మెజారిటీ ఉన్నదని, కానీ ఈసారి మాత్రం బీజేపీకి స్పష్టమైన మెజారిటీ రాలేదని గౌరవ్ గుర్తుచేశారు. కాబట్టి ఇప్పుడు మిత్రపక్షాల అండతో ప్రభుత్వం నడపాల్సి ఉంటుందని, ప్రధాని మోదీ ఐదేళ్ల ప్రభుత్వాన్ని నడపడంపై తనకు అత్యంత అనుమానంగా ఉందని గొయ్ చెప్పారు.

సంపాదకీయం

శనివారం 08-06-2024

# అవినీతిపరులను బోను ఎక్కించాల్సిందే !

కేంద్రంలో ఎన్‌డిఎ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ఏర్పడబోతోంది. ఎపిలో కూడా చంద్రబాబు నాయుడు మరోమారు అధికార పగ్గాలు చేపట్టబోతున్నారు. ఈ క్రమంలో ఎన్‌డిఎ ప్రభుత్వం గతం కన్నా మిన్నగా పనితీరు ప్రదర్శించాల్సి ఉంది. ప్రజల సమస్యలపై తక్షణం స్పందించాలి. దేశాభివృద్ధికి రూట్‌మ్యాప్ సిద్దం చేసుకోవాలి. రాష్ట్రాలను అభివృద్ధి చేసే క్రమంలో పార్టీలకు అతీతంగా నడుచుకోవాలి. అలాగే అధికారం అడ్డం పెట్టుకుని అవినీతి, అక్రమాలకు పాల్పడి, రాష్ట్రాలను దివాళా తీయించిన నిరంకుశ నేతలను ప్రజల ముందు దోషులుగా నిలబెట్టి చర్యలు తీసుకోవాల్సిందే. ఈ క్రమంలో ఎపిలో జగన్, తెలంగాణలో కెసిఆర్ అవినీతి అక్రమాస్తుల కేసులు మళ్లీ ముందుకు రానున్నాయి. జగన్ ఇప్పటికే బెయిల్‌పై ఉంటూ రాజ్య మేలారు. అలాగే అనేక అవినీతి కేసుల్లో పీకల్లోతు వరకు మునిగారు. వీటిని తవ్వి తీయడానికి అధికారంలోకి వచ్చే తెలుగుదేశం తప్పకుండా ప్రయత్నం చేస్తుంది. ఇక్కడ తెలంగాణలో కూడా కెసిఆర్ ఫోన్‌ట్యాపింగ్ ప్రకంపనలు సృష్టిస్తోంది. మరోవైపు ఒక్కటంటే ఒక్క ఎంపి సీటు గెలవకపోవడంతో బిఆర్‌ఎస్ ప్రభ పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కూడా ఉంటారో..జారుకుంటారో తెలియని పరిస్థితి ఉంది. ఈ క్రమంలో ఇరు తెలుగు రాష్ట్రాల్లో ఓటమి పాలయిన మాజీ ముఖ్యమంత్రులకు కేసులను ఎదుర్కోక తప్పని పరిస్థితి రాబోతున్నది. మొన్నటి వరకు ఎన్నికల కోడ్ కారణంగా కొంత స్తబ్దత ఏర్పడింది. జగన్ కూడా అధికారంలో ఉండగా విచ్చలవిడిగా అధికార దుర్వినయోగానికి పాల్పడ్డారు. చంద్రబాబును, ఆయన అనుచరులను వేటాడి వెంటాడారు. ఇవన్నీ చూస్తూ ఊరుకునే కేసులు కావు. ప్రధానంగా ఇసుక, మట్టి మాఫియాలు దోచుకున్నాయి. అలాగే మద్యపాన నిషేధం చేయకపోగా లోకల్ బ్రాండ్లతో వేలకోట్లు దొచారు. వీటన్నటిపైనా టిడిపి శ్రేణులు గత ఐదేళ్లుగా పోరాడుతున్నారు. అనేక కేసులు ఎదుర్కొన్నారు. ఇలాంటి వాటిని చూస్తూ ఊరుకుంటారనడానికి లేదు. అనేక రంగాల్లో అవతవకలు జరిగాయి. భూ ఆక్రమణలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. అన్నింటికి మించి వివేకానందరెడ్డి మర్డర్ కేసును సిబిఐ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసు సక్రమంగా సాగడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కేంద్రంలో ఇప్పుడు మోడీ ప్రభుత్వం ఏర్పడ్డా ఎన్‌డిఎ భాగస్వాములకు ప్రాధాన్యం పెరిగింది. చంద్రబాబుకు కూడా ప్రాధాన్యం మరింతగా పెరిగినట్లే . ఈక్రమంలో అనేక అవినీతి కేసుల్లో చరంద్రబాబు చూస్తూ ఊరుకుంటారనడానికి లేదు. కేంద్రంపై ఒత్తడి తెచ్చికేసుల దర్యాప్తులో వేగం పెంచే అవకాశం ఉంది. అలాగే ఎన్‌డిఎ ప్రభుత్వంలో చేరితే తెలుగుదేశం పార్టీ కీలకమైన మంత్రి పదవులను పట్టుబట్టి తీసుకునే అవకాశం ఉంటుంది. దీంతో కేంద్రంలో కీలకంగా ఉంటారు. ఇకపోతే తెలంగాణలో కూడా ఇదే పరిస్థితి ఉంది. బిజెపి ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్‌ను ఇరికించే ప్రయత్నం చేశారన్న విషయంలో బిజెపి ఊరుంటుందనడానికి లేదు. ఇప్పుడు బిఆర్‌ఎస్‌తో అంటకాగాల్సిన అవసరం కూడా బిజెపికి లేదు. వందల మంది ఫోన్లను ట్యాప్ చేయించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చివరకు రాజకీయంగా అతఃపాతాళానికి తొక్కివేయబడ్డారు. రాజకీయంగా ఇప్పటికప్పుడు చక్రం తిప్పేది లేదు. మరో ఐదేళ్ల వరకు రాజకీయాలు ఎలా ఉంటాయో తెలియదు. అప్పటి వరకు బిఆర్‌ఎస్ నిలదొక్కుకునేది కూడా కష్టమే. ఉన్న ఎమ్మెల్యేలు కూడా అంటిపెట్టుకుని ఉంటారని కూడా లేదు. ఈ క్రమంలో కేసుల్లో ఇరుక్కోకుండా ఉండేందుకు సాయం చేసేవారు కూడా లేదు. సొంత మనుషలను పరాయివాళ్లలా అనుమానించి దూరం చేసుకున్నారు. ఉద్యమం నాడు వెన్నంటి నడిచిన వారెవరూ ఆయన వెంటలేరు. ఇప్పుడు ఆయనే ఒంటరి అయ్యారు. పార్లమెంట్ ఎన్నికలతో పార్టీ మొత్తంగా దెబ్బతింది. ఒక్కటంటే ఒక్క ఎంపి సీటు గెలవకపోవడం, డిపాజిట్లు కూడా దక్కకపోవడంతో ప్రజల్లో ఉన్న ఆదరణ కూడా పోయింది. అధికారమంటే బాధ్యత అనే విషయం విస్మరించి, తమకు ప్రత్యర్థులే ఉండకూడదన్న ధోరణితో వ్యవహరించడం వల్లనే కేసీఆర్‌కు ప్రస్తుత దుస్థితి దాపురించింది. కేసీఆర్ తరహాలో అధికారంతో విర్రవీగిన వారికి ఈ తరహా పతనమే తప్పదని జగన్ కూడా రుజువు చేశారు. కేంద్రంలో మోడీ కూడా ఇదే తరహాలో అధికార ఆధిపత్యం చెలాచించినా..గుడ్డిలో మెల్లలా కూటమితో బయటపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు అహంకారంతో వ్యవహరించరాదని మోడీ, జగన్, కెసిఆర్ ల ఉదాహరణలు చెప్పుకోవాలి. బలమైన నాయకులను పక్కన పెట్టుకోగూడదని కోరుకుంటారు. ప్రాంతీయ పార్టీలలో ఈ ధోరణి అధికంగా ఉంటుంది. కేసీఆర్,జగన్ కూడా ఇదే మార్గంలో పయనించి ఇప్పుడు అధికారం కోల్పోయారు. తెలంగాణ ఉద్యమంతో మమేకమై పార్టీని నమ్ముకొని ఉన్నవాళ్లను కాదని ప్రజాబలం లేని వాళ్లను, తనకు వంత పాడే వాళ్లను కేసీఆర్ తన చుట్టూ నింపుకొన్నారు. ఫలితంగా బలమైన నాయకులు దూరమయ్యారు. ప్రజాబలం లేకపోయినా కేసీఆర్ మనసెరిగి వ్యవహరించడం ద్వారా లాభపడుతూ వచ్చిన వాళ్లు ఇప్పుడు ఒక్కొక్కరుగా ఆయనను విడిచి వెళ్లిపోయారు. ఎన్‌డిఎ పక్షాలకు ఇంకా కొంచె ఎక్కువ సీట్లు వచ్చి, బిజెపికి తక్కువ సీట్లు వచ్చివుంటే మోడీ పరిస్థితి కూడా రివర్స్ అయ్యేది. కానీ అదృష్టంకొద్దీ మోడీ బయట పడ్డారు. మోడీ కూడా తన విధానాలను సమీక్షించుకోవాలి. ప్రజలు మెచ్చే పాలన అందించే ప్రయత్నం చేయాలి. ప్రజలు పడుతున్న బాధలను తెలుసుకుని వాటి పరిష్కారానికి పనిచేయాలి. ఎన్‌డిఎ పక్షాలు ఇప్పుడు కీలక భూమిక పోషించాలి. రాష్ట్రాల్లో విచ్చలవిడిగా వ్యవహరించి, అప్పుల కుప్ప చేసిన రాష్ట్రాలను గాడిలో పెట్టాలి. రాజకీయాలకు అతీతంగా కేంద్ర, రాష్ట్రాలు కలసి పనిచేయాలి. ప్రజలకు అవసరమైన పనుల విషయాలో రాజకీయాలను పక్కన పెట్టాలి. ఉమ్మడి ఎజెండాకు అనుగుణంగా, అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగాలి. అలాగే అవినీతికి పాల్పడ్డ నేతలను బజారులో నిలబెట్టాల్సిందే. అవినీతి, అధికార దుర్వినియోగం చేసిన వారిని ఉపేక్షించరాదు. కెసిఆర్ లేదా, జగన్‌లు ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకొని లేచి నిలబడే ప్రయత్నం చేస్తే భవిష్యత్తు ఉండవచ్చు. కానీ వారి వ్యవహార శైలి మార్చుకోకపోతే ప్రయోజనం ఉండదు. ప్రాంతీయ వాదంతో కేసీఆర్ ఇంత కాలం రాజకీయాల్లో రాణించారు. కానీ సెంటిమెంట్‌తో ఇక రాజకీయాలు చేయడం సాధ్యం కాదు. అధికారంలో ఉన్నప్పుడు మీడియాను భయపెట్టి లొంగదీసుకున్నారు. మీడియాను కూడా దూరం చేసుకోవడంతో వారు కూడా కెసిఆర్‌కు దూరం అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో పీఎస్సార్ ఆంజనేయులు, రఘురామి రెడ్డి, రవిశంకర్ రెడ్డి, రిషాంత్ రెడ్డి వంటి వాళ్లు అన్ని రకాల పరిధులను అతిక్రమించి వ్యవహరించినట్టు వార్తలు వస్తున్నాయి. హద్దులు దాటి ప్రవర్తించే అధికారులు ఎప్పటికైనా మూల్యం చెల్లించుకోవలసిందే!

# వరంగల్లో కాంగ్రెస్ పట్టు...బీఆరెస్ ఫట్

హైదరాబాద్,విప్లవోద్యమాల ఖిల్లా, తెలంగాణ ఉద్యమానికి పోరుగడ్డగా నిలిచిన ఉమ్మడి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా తమతమ నియోజకవర్గాల్లో పట్టు నిలబెట్టుకుని ముగ్గురు పార్టీ ఎంపీ అభ్యర్థుల విజయంలో కీలక భూమిక పోషించారు. తెలంగాణ ఉద్యమపార్టీగా జిల్లాలో ప్రత్యేకతను సంతరించుకున్న బీఆరెస్ తన వైభవాన్ని కోల్పోయి మానుకోట ఎంపీ పరిధిలో రెండవ స్థానానికి, వరంగల్ ఎంపీ పరిధిలో మూడవ స్థానానికి చేరుకున్నది. అసెంబ్లీ సెగ్మెంట్లలో సైతం ఇదే పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా అధికార కాంగ్రెస్ పార్టీ ఒక్క వరంగల్ తూర్పు మినహా ఉమ్మడి వరంగల్ జిల్లాలో మిగిలిన 11 నియోజకవర్గాల్లో భారీ మెజారిటీ సాధించారు. 12 అసెంబ్లీ సెగ్మెంట్లలో జనగామ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతిపక్ష బీఆరెస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నియోజకవర్గం సైతం భువనగిరి ఎంపీ పరిధిలో ఉంటుంది. మిగిలిన 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 7 నియోజకవర్గాలు వరంగల్ లోక్ సభ పరిధిలో, మిగిలిన నాలుగు నియోజకవర్గాలు మహబూబాబాద్ లోక్ సభ పరిధిలో ఉంటాయి. ప్రస్తుతం 12 నియోజకవర్గాల్లో 11 స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. స్టేషన్ ఘన్ పూర్ బీఆరెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్ లో చేరిన విషయం తెలిసిందే.

**11 స్థానాల్లో కాంగ్రెస్ మెజారిటీ**

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలేని జనగామ సెగ్మెంటులో సైతం మంచి మెజారిటీ సాధించి భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కిరణ్ కుమార్ రెడ్డి విజయానికి దోహదం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థికి 32వేలకు పైగా మెజారిటీ లభించింది. కాంగ్రెస్ అభ్యర్థి కిరణ్ కుమార్ రెడ్డికి 76,032 ఓట్లు, బీజేపీకి 44,787 ఓట్లు, బీఆరెస్ కు 43,844 ఓట్లు లభించాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినా పార్లమెంటు ఎన్నికల్లో పట్టు నిలుపుకున్నది. ఒక్క వరంగల్ తూర్పులో మాత్రం 7వేల ఓట్ల మెజారిటీ బీజేపీ సాధించింది. ఇక్కడ కాంగ్రెస్ రెండవ స్థానానికి పరిమితమైంది. ఈ నియోజకవర్గానికి మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి 67,066 ఓట్లు రాగా, బీజేపీకి 74,142 ఓట్లు, బీఆరెస్ కు 20, 360 ఓట్లు లభించాయి, ఇదిలా ఉండగా మిగిలిన నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు తమ పట్టును నిలుపుకున్నారు.

**నర్సంపేట ఫస్ట్ ప్లేస్**

మానుకోట ఎంపీ పరిధిలోని నర్సంపేట అసెంబ్లీ సెగ్మెంట్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరామ్ నాయక్ కు 55111 ఓట్ల మెజారిటీ లభించింది. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి లక్షా339 ఓట్లు రాగా బీఆరెస్ కు 45,228 ఓట్లు లభించాయి.

**రెండవ స్థానంలో ములుగు**

మానుకోట ఎంపీ పరిధిలోని ములుగు సెగ్మెంట్లో కాంగ్రెస్ కు 53,233 ఓట్ల మెజారిటీ లభించింది. ఈ నియోజకవర్గంలో మంత్రి ధనసరి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి 86,825 ఓట్లు రాగా, ప్రత్యర్థి బీఆరెస్ కు 33,592 ఓట్లు లభించాయి.

**మూడవ స్థానంలో మానుకోట**

మానుకోట ఎంపీ పరిధిలోని మహబూబాబాద్ అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీకి 49,883 ఓట్ల మెజారిటీ లభించింది. ఇక్కడ ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్ కు లక్షా211ఓట్లు రాగా, బీఆరెస్ కు 52.128 ఓట్లు లభించాయి.

**డోర్నకల్ లో 45వేల మెజారిటీ**

మానుకోట ఎంపీ పరిధిలోని డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 45013 ఓట్ల మెజారిటీ కాంగ్రెస్ కు లభించింది. ఇక్కడ విప్ డాక్టర్ రామచంద్రు నాయక్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్ కు 95,306 ఓట్లు రాగా, బీఆరెస్ కు 50,293 ఓట్లు వచ్చాయి.

**పాలకుర్తిలో 44వేల మెజారిటీ**

వరంగల్ ఎంపీ పరిధిలోని పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ 44,767 ఓట్ల మెజారిటీ లభించింది. ఇక్కడ యశస్వినిరెడ్డి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యంవహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి 80,256 ఓట్లు పొందగా, బీజేపీకి



35,489 ఓట్లు, బీఆరెస్ కు 47,878 ఓట్లు లభించాయి.

**భూపాలపల్లిలో 32వేల మెజారిటీ**

వరంగల్ ఎంపీ పరిధిలోని భూపాలపల్లిలో కాంగ్రెస్ పార్టీకి 32,164 ఓట్ల మెజారిటీ లభించింది. ఇక్కడ గండ్ర సత్యనారాయణరావు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి 85,629 ఓట్లు, బీజేపీకి 53,465 ఓట్లు, బీఆరెస్ కు 31,360 ఓట్లు లభించాయి.

**వర్ధన్నపేటలో 31వేల మెజారిటీ**

వర్ధన్నపేటలో కాంగ్రెస్ కు 31వేల మెజారిటీ లభించింది. ఇక్కడ కేఆర్ నాగరాజు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి 91,779 ఓట్లు రాగా, బీజేపీకి 59,886 ఓట్లు, బీఆరెస్ కు 31,345 ఓట్లు లభించాయి. ఈ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి రమేష్ గతంలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేశారు.

**పరకాలలో 22వేల మెజారిటీ**

పరకాలలో 22వేల మెజారిటీ కాంగ్రెస్ సాధించింది. ఇక్కడ ఎమ్మెల్యేగా రేవూరి ప్రకాష్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి 73,378 ఓట్లు, బీజేపీకి 50477 ఓట్లు, బీఆరెస్ కు 36,477 ఓట్లు లభించాయి.

**స్టేషన్ పై కడియం పట్టు**

స్టేషన్ ఘన్ పూర్ లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు 63075 ఓట్లు లభించాయి. బీజేపీకి 45,152 ఓట్లు, బీఆరెస్ కు 41,357 ఓట్లు లభించాయి. స్టేషన్ ఘన్ పూర్ లో ఎమ్మెల్యేగా కడియం –శ్రీ హరి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కడియం బీఆరెస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ లో చేరారు. శ్రీహరి కుమార్తె కావ్య ఎంపీగా పోటీచేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆరెస్ ఎమ్మెల్యేగా శ్రీహరికి 101696 ఓట్లు లభించాయి. కాంగ్రెస్ కు 93,917 ఓట్లు, బీజేపీకి కేవలం 4,984 ఓట్లు మాత్రమే లభించాయి. 7,779 ఓట్ల మెజారిటీతో కడియం గెలుపొందారు. ప్రస్తుతం 17,923 ఓట్ల మెజారిటీ సాధించారు. అనూహ్యంగా బీజేపీకి కూడా ఓట్లు భారీగా పెరిగాయి. ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గానికి చెందిన వ్యక్తి కావడంతో కొంత ప్రభావం కనబరిచింది.

**వరంగల్ పశ్చిమలో 7వేల మెజారిటీ**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ 7,167 ఓట్ల మెజారిటీ సాధించింది. ఈ నియోజకవర్గంలో నాయిని రాజేందర్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి 65,584 ఓట్లు, బీజేపీకి 58,417 ఓట్లు, బీఆరెస్ కు 19680 ఓట్లు లభించాయి.

**మూడవ స్థానానికి బీఆరెస్ పరిమితం**

వరంగల్ ఎంపీ పరిధిలో అనూహ్యంగా బీఆరెస్ మూడవ స్థానానికి పరిమితమైంది. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సైతం మూడవ స్థానంలో నిలిచింది. ఒక్క పాలకుర్తి సెగ్మెంటులో మాత్రం రెండవ స్థానంలో నిలిచింది. ఇక్కడ బీజేపీ మూడవ స్థానానికి పరిమితమైంది. 2014 నుంచి వరంగల్ ఎంపీ స్థానం బీఆరెస్ వరుసగా కైవసం చేసుకుంటోంది. సిట్టింగ్ స్థానంలో బీఆరెస్ మూడవ స్థానానికి పరిమితమైంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో రెండవ స్థానంలో నిలిచిన బీఆరెస్ ఇప్పుడు మూడవ స్థానానికి నెట్టివేయబడింది. వరంగల్ తూర్పు, పశ్చిమలో ఆ పార్టీ ఓట్లు కూడా పూర్తిగా తగ్గిపోయాయి. ఇదిలా ఉండగా మానుకోట ఎంపీ పరిధిలో బీఆరెస్ రెండవ స్థానంలో ఉంది. కాంగ్రెస్, బీఆరెస్ మధ్య పోటీ జరిగింది.

# రాష్ట్ర ప్రయోజనాలకోసం పనిచేద్దాం



అమరావతి,మనమంతా కలసి పని చేస్తూ రాష్ట్ర ప్రయోజనాల కోసం కష్టపడదామని టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆ పార్టీ అధినేత చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రం కోసం ఎంపిలంతా కేంద్రంతో ఎప్పుడూ పోరాడుతూనే ఉండాలన్నారు. అలాగే తానూ ఎంపిలతో నిరంతరం టచ్‌లో ఉంటానని హామీ ఇచ్చారు. టిడిపి నుంచి ఎంపికైన కొత్త ఎంపిలతో సమావేశం గురువారం అమరావతిలో జరిగింది. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన టీడీపీ ఎంపీలతో చంద్రబాబు మాట్లాడుతూ.. ఇకపై మీరంతా మారిన చంద్రబాబును చూస్తారని అన్నారు. చంద్రబాబు మారరు.. ఎవరి మాట వినరు అనే మాట ఇక వినిపించబోదని అన్నారు. ఇకపై తనను ఎంపీలు తరచూ కలుస్తూ ఉండాలని కోరారు. ఎంత బిజీగా ఉన్నా పక్కకు వచ్చి మరీ ఎంపీలతో మాట్లాడతానని అన్నారు. రాష్ట్రంలో ఇకపై బ్యూరోక్రాట్స్ పాలన ఉండబోదని.. పూర్తి రాజకీయ పాలన తెస్తామని అన్నారు. ఇకపై మీరు మారిన చంద్రబాబును చూస్తారు. ఇకపై బ్యూరోక్రాట్స్ పాలన ఎంతమాత్రం ఉండదు. చంద్రబాబు మారరు అనే అపవాదు నాపై ఉంది. ఇకపై అలా ఉండదు.. మీరే ప్రత్యక్షంగా చూస్తారు. ఎంపీలందరూ తరచూ వచ్చి కలవండి. నేను బిజీగా ఉన్నా కూడా మీతో మాట్లాడతాను. నాకోసం ఈ ఐదేళ్లు నేతలు, కార్యకర్తలు ప్రాణాలిచ్చారు. కత్తి మీద పెట్టినా జై టీడీపీ, జై చంద్రబాబు అన్నారు – అధికార పార్టీ ఒత్తిడికి ఎవరూ తలొగ్గలేదు. ఇకపై ప్రతి అంశాన్ని నేను వింటాను.. నేనే చూస్తాను. ఇకపై రాజకీయ పరిపాలన ఉంటుంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు అంతా కలిసి పనిచేయాలి. అందరూ ఎవరి పరిధిలో వారు పనిచేయాలి. ఈ ఐదేళ్లు నేతలు, కార్యకర్తలు పడిన ఇబ్బందులు నాకు చాలా మనోవేదన కలిగించాయి –నేతలు, కార్యకర్తల కష్టం, త్యాగం, కృషి వల్లే ఇవాళ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఈనెల 12 ప్రమాణ స్వీకారం చేస్తా. ఢిల్లీలో రాష్ట్ర ప్రయోజనాల కోసం పని చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు సూచించారు. ఎన్నికల్లో గెలిచినందుకు వారికి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రంలో మంత్రివర్గ కూర్పు.. తెదేపాకు ఉన్న ప్రాధాన్యం తదితర అంశాలపై చర్చించారు. ఈ భేటీలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తదితరులు పాల్గొన్నారు. మరోవైపు పార్టీ ఎంపీలతో చంద్రబాబు శుక్రవారం దిల్లీ వెళ్లనున్నారు. ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశానికి వారితో కలిసి హాజరుకానున్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఎవరూ ఆకాశంలో విహరించొద్దని గెలిచిన ఎంపీలకు తెదేపా అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజలు నమ్మకంతో ఇచ్చిన విజయాన్ని బాధ్యతగా సమాజ సేవ చేసేందుకు వినియోగించాలని సూచించారు. రాష్ట్ర ప్రయోజనాలు పట్టించుకోని వైకాపా ఎంపీలు జగన్ కేసుల మాఫీ అజెండాతోనే దిల్లీలో పైరవీలు చేశారని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలే మనందరి ప్రథమ కర్తవ్యం కావాలన్న చంద్రబాబు.. అందుకు తగ్గట్టుగానే పార్లమెంట్‌లో కృషి చేయాలన్నారు. ముందు ప్రజాస్వామ్య వ్యవస్థల్ని గౌరవించాలి, ఆ తర్వాతే మనమని తెలిపారు. వ్యవస్థలకు అతీతంగా ఎవరు వ్యవహరించినా, ఆ వ్యవస్థే తిరిగి కాటేస్తుంది అని గుర్తించాలన్నారు. పదవులు శాశ్వతం అని ఎవ్వరూ అనుకోవద్దని అన్నారు. సీఎంగా తన ప్రమాణ స్వీకారానికి మోదీని ఆహ్వానించానని, వచ్చేందుకు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. అందుబాటులో ఉన్న పలువురు ఎంపీలు ఉండవల్లిలో జరిగిన పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ప్రత్యక్షంగా హాజరయ్యారు. ఇతర ఎంపీలు జూమ్ కాల్ ద్వారా టీడీపీపీలో పాల్గొన్నారు. ఎంపీలు అందరికీ చంద్రబాబు నాయుడు ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. రేపటి ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశానికి కూటమిలో భాగమైన టీడీపీ ఎంపీలు అంతా హాజరవ్వనున్నారు. నియోజకవర్గాల్లో ఉన్న ఎంపీలు నేటి రాత్రికి ఢిల్లీ చేరుకోనున్నారు.పార్లమెంటరీ భేటీ తర్వాత టీడీపీ ఎంపీలు మీడియాతో మాట్లాడారు. మోదీ, చంద్రబాబు, పవన్ కృషి వల్లే భారీ విజయం నమోదైందని అన్నారు. తెలుగు ప్రజల్లో ఉన్న కసి కూడా భారీ విజయానికి కారణం అన్నారు. ఎన్నికల ముందు నుంచి ఎన్డీఏ కూటమితో ప్రయాణిస్తున్నామని అన్నారు. ఎన్డీఏ కూటమికే మా సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు. రాష్ట్రానికి అనేక అంశాల్లో కేంద్రం మద్దతు కావాల్సి ఉందని అన్నారు. సమావేశానికి అందుబాటులోని లేని ఎంపిలు జూమ్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

# పంటపెట్టుబడి కోసం ఎదురుచూపు

కాకినాడ, ప్రతీ ఏటా రైతుకు ధాన్యం అమ్ముకోవడం సమస్యగా మారుతోంది. అష్టకష్టాలు పడి రబీ పంట పండించినా ధాన్యాన్ని ఇంకా పూర్తిగా ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. కొన్న దానికీ పూర్తిగా డబ్బులివ్వలేదు. రబీ పండించిన ధాన్యానికి ఇంకా డబ్బు చేతికి రాకపోతే ఎలా పెట్టుబడి పెట్టగలమని నిలదీస్తున్నారు. జిల్లాలో గోదావరి డెల్టా సిస్టమ్ కింద 75,678 ఎకరాల ఆయకట్టు ఉంది. ఎత్తిపోతల పథకాలు కింద అంత ఆయకట్టు ఎప్పుడూ సాగవ్వడంలేదు.వాటి అంచనాల్లో నాల్గొవ వంతు కూడా లేదు. ఎక్కువ మంది బోర్ల ద్వారా పంట పండిస్తారు. ఇదంతా సాగులోకి రావాలంటే ఎంత పెట్టుబడి కావాలి. కాలువలకు నీరు విడుదల చేసినంత మాత్రాన ముందస్తు ఖరీఫ్ సాగవ్వదు. ఎందుకంటే కాల్వలకు నీరు నెమ్మదిగా వెళ్లినా, అది పూర్తి స్థాయి నారుమళ్లకు కూడా సరిపోదు.ఈలోపు రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటారు. గట్లంకలు వేస్తారు. బోదెలు తవ్వుకుంటారు. ఈలోపు వర్షాలు బాగా వచ్చి తొలకరిస్తే అన్ని పొలాల్లో నీరు ఉంటుంది. రైతులు కూడా ముందుకు వస్తారు. ఈలోపు రైతు చేతిలో పెట్టుబడి సొమ్ము ఉండాలి. రబీ ధాన్యం సొమ్ము అందితే ఉరకలు వేస్తూ ముందస్తు ఖరీఫ్‌కు వెళతాడు. కానీ ఏదీ. సొమ్మింకా అందలేదు.కొనుగోలు చేసిన 21 రోజుల్లో డబ్బులు వేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ వాస్తవ పరిస్థితి దానికి భిన్నంగా ఉంది. మరి రైతు ఏ విధంగా ఏరువాకకు సిద్ధమవుతాడు. సిద్ధం కావాలంటే అప్పు చేయవలసిందే. రబీ డబ్బు అంతా అందితే రైతులు ఏరువాకకు ఉరకలు వేస్తారు.

# దెబ్బతీసిన కాంగ్రెస్

న్యూఢిల్లీ, సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి ఎన్‌డికు గట్టి పోటీని ఇచ్చింది. కాంగ్రెస్ ముక్త భారత్ లక్ష్యంలో మోడీ ద్వయం అన్నీ మరచి రాజకీయాలు చేశారు. ఎదుటి పార్టీలను ఆర్థికంగా దెబ్బతీయడం, వారిని కేసుల్లో ఇరికించి లోపల పెట్టడం వంటటి దుశ్చర్యలను ఇకనైనా మానుకోవాలి. పార్టీలను చీల్చడం, ప్రభుత్వాలను కూల్చడం జరగకుండా చూసుకోవాలి. సంకీర్ణ పార్టీలు కూడా బాధ్యతగా నడుచుకోవాలి. ఎన్నికల్లో ఓటమికి గల అంశాలను బిజెపి విశ్లేషించుకుని ముందుకు సాగితే మంచిది. ప్రధానంగా యూపీ, మహారాష్ట్ర, బంగాల్‌లో బీజేపీకి గట్టిపోటీ ఇచ్చింది. ఈ మూడు రాష్ట్రాలతోపాటు మరికొన్ని ప్రాంతాల్లోనూ బీజేపీపై అనేక అంశాలు ప్రభావం చూపినప్పటికీ.. ప్రధానంగా రిజర్వేషన్ల అంశం వెంటాడింది. దేశంలో ఆదివాసీలు, దళితుల జనాభా ఎక్కువ కాగా.. గత రెండు ఎన్నికల్లోనూ ఆ రెండు సామాజిక వర్గాలు బీజేపీకి మద్దతు ఇచ్చాయి. కానీ.. ఈ దఫా ఎన్నికలకు ముందు కొంతమంది బీజేపీ నేతలు రిజర్వేషన్లపై చేసిన కామెంట్స్ విపక్షాలకు ప్రాణం పోశాయి. రాజ్యాంగాన్ని మార్చివేస్తామన్న బీజేపీ నేతల మాటలను ప్రధాన అస్త్రంగా మార్చుకున్నాయి. రిజర్వేషన్లను రద్దు అంశాలన్ని ఇండి కూటమి మారుమూల ప్రాంతాల్లోకి బలంగా తీసుకెళ్లింది. దాంతో.. తమ రిజర్వేషన్లపై బీజేపీ ప్రభావం చూపిస్తుందన్న ఆందోళనతో ఆ పార్టీకి వ్యతిరేకంగా ఓట్లు వేసినట్లు తెలుస్తోంది. అయితే.. కాంగ్రెస్ విమర్శలను ప్రధాని మోదీతోపాటు అగ్రనేతలు తిప్పికొట్టినా పార్టీ యంత్రాంగం ఆయా వర్గాల్లోకి తీసుకెళ్లడంలో విఫలమైంది. పార్టీ వ్యవస్థ సక్రమంగా పనిచేయకపోవడం, భారత రాజ్య వ్యవస్థ అప్రజాస్వామిక స్వభావం, లోపభూయిష్టమైన ఆర్థికాభివృద్ధి నమూనా, మన అస్తిత్వ ప్రాకృతిక ప్రాతిపదికల విధ్వంసం... ఈ సమస్యల మూలాలు మన రిపబ్లిక్ నిర్మాణ వ్యవస్థల్లో ఉన్నాయి. వాటికి ప్రధాన బాధ్యత దశాబ్దాల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీదే. అయితే 2014లో నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తరువాత అవి మరింతగా విషమించాయి. పర్యవసానంగా దేశ పురోగతి బాగా కుంటువడింది. గవర్నర్ వ్యవస్త వివాదాస్పదంగా మారింది. ఇందిరాగాంధీ హయాంలో అధికరణ 356ను తరచుగా ఉపయోగించడం జరిగిందని కూడా బీజేపీ శ్రేణులు ఫిర్యాదు చేస్తుంటాయి. అయితే బీజేపీయేతర పార్టీల ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం శత్రుత్వ భావంతో వ్యవహరించడం జరిగింది. ఇప్పుడది మానుకోవాలి. బీజేపీ పాలనలో లేని రాష్ట్రాల న్యాయబద్ధ హక్కులను ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పూర్తిగా ఉపేక్షిస్తున్నారు. గవర్నర్లుగా నియమితులయిన పెద్ద మనుషులు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను చికాకు పెట్టేలా చీటికీ మాటికీ అనేక అవరోధాలు కల్పిస్తున్నారు. ఇదిలావుంటే.. ముస్లిం రిజర్వేషన్ల రద్దు నినాదంతోనూ బీజేపీ భారీ మూల్యం చెల్లించుకున్నట్లే తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రధాని మోదీ, అమిత్ షా సహా పలువురు బీజేపీ అగ్ర నేతలంతా తాము మళ్లీ అధికారంలోకి వచ్చాక.. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామంటూ పెద్దయెత్తున ప్రచారం చేశారు. ఎక్కడికి వెళ్లినా.. ఏ సభలో మాట్లాడిన.. బీజేపీ అగ్ర నేతలంతా ముస్లిం రిజర్వేషన్ల రద్దు చేస్తామని ఘంటాపథంగా చెప్పడంతో ఆయా వర్గాల్లో భయాందోళన నెలకొంది. దాంతో.. ముస్లిం వర్గాలన్నీ బీజేపీకి వ్యతిరేకంగా ఓటింగ్ చేసినట్లు సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. దానికి.. యూపీ, మహారాష్ట్ర, బంగాల్‌లో సీట్లు తగ్గడమే నిదర్శనమని అంచనా వేస్తున్నారు. ముస్లిం రిజర్వేషన్ల రద్దు నినాదంతో బీజేపీకి మేలుకంటే కీడే ఎక్కువ జరిగిందని చెప్పుకొస్తున్నారు. రిజర్వేషన్లకు ఎక్కడ నష్టం వాటిల్లుతుందోనని భావించిన ఆయా వర్గాలు.. బీజేపీకి వ్యతిరేకంగా ఓట్లు వేయడం.. కాంగ్రెస్‌కు ప్లస్ పాయింట్‌గా మారింది. ఇంకా చెప్పాలంటే.. యూపీలో కాస్త ముస్లిం ఓటర్లు ఎక్కువ. గత ఎన్నికల్లో యూపీలోని మెజార్టీ ముస్లింలు బీజేపీని ఆదరించారు. గంపగుత్తగా కమలం పార్టీ ఖాతాలో ఓట్లు వేశారు ముస్లింలు. కానీ.. ఈ ఎన్నికల్లో ఎప్పుడైతే.. ముస్లిం రిజర్వేషన్ల రద్దు నినాదాన్ని బీజేపీ భుజానకెత్తుకుందో అప్పటినుంచి ఆయా వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఈ క్రమంలో.. గతంలో బీజేపీకి ఓట్లు వేసిన ముస్లిం వర్గాలు.. ఈ సారి కాంగ్రెస్ ఆధ్వర్యంలోని.. ఇండి కూటమి వైపునకు మళ్లారు. దాంతో.. టా÷–గ్గ÷ట్ 400 సీట్లు అని ప్రచారం చేసిన బీజేపీ.. కనీసం 300 మార్క్‌ను కూడా దాటలేకపోయిందని చెప్పొచ్చు. యూపీ, బెంగాల్, మహారాష్ట్రలో ముస్లిం ఓటర్లు ఎక్కువ ఉండగా.. అయా రాష్టాల్లో్ర బీజేపీ అనుకున్న రేంజ్‌లో సీట్లు సాధించలేకపోయింది.

## నకిలీ విత్తనాలు, నిషేధిత గడ్డిమందు పట్టివేత

సూర్యాపేట,సూర్యాపేట జిల్లాలో నకిలీ విత్తనాలు, నిషేధిత గడ్డిమందును పోలీసులు పట్టుకున్నారు. నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి 52 కిలోల నకిలీ పత్తి విత్తనాలు, మూడు లక్షల రూపాయల విలువగల 300 లీటర్ల నిషేధిత గడ్డి మందులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. నకిలీ విత్తనాలు, నిషేధిత గడ్డిమందునక్విక్రయిస్తున్న సంకేపల్లి సోమిరెడ్డి(53 ), గుగులోత్ ప్రేమ్ కుమర్ (29) అనే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని వారిని త్వరలో పట్టుకుంటామన్నారు. అలాగే అర్వపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కోదూరు గ్రామంలో నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తున్న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని 22 కిలోల నకిలీ పత్తి విత్తనాలు సీజ్ చేశారని తెలిపారు.

# తెలంగాణపై బిజెపి ప్రత్యేక ఫోకస్

హైదరాబాద్, బిజెపి తెలంగాణ రాజకీయాలపై గట్టిగానే ఫోకస్ పెట్టనుంది. బిఆర్ఎస్ కనుమరుగు కావడంతో ఆ పాత్రలో పరకాయ ప్రవేశం చేసేందుకు కసరుత్త చేసే అవకాశం ఉంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కొంత బలం చాటిని బిజెపి ఇప్పుడు ఎంపి ఎన్నికలతో మరింత బలోపేతంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఇక్కడ గెలిచిన 8మంది ఎంపిల్లో మరోమారు ఒకరిద్దరికి మంత్రి పదవులు దక్కే ఛాన్స్ ఉంది. కిషన్‌రెడ్డి గత మంత్రివర్గంలో ఉన్నారు. ఇప్పుడు ఆయనకు ఇస్తారా లేక మరెవరికైనా ఇస్తారా అన్నది చూడాలి. మరోవైపు కెసిఆర్ అవినీతిపై చర్యలు తీసుకోవాలన్న పట్టుదల కాంగ్రెస్ , బిజెపి నేతల్లో కనిపిస్తోంది. ప్రభుత్వ ఏజెన్సీలు కూడా కేసీఆర్‌పై నిఘా పెట్టాయని బిజెపి పరోక్షంగా హెచ్చరికలు చేస్తోంది. ఎన్నికలకు ముందు కేసీఆర్ చుట్టూ కేంద్ర పెద్దలు ఉచ్చు బిగిస్తున్నట్లు ప్రచారం చేశారు. ఇంతకాలం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వంటి సంస్థలు ఏ క్షణంలోనైనా రంగంలోకి దిగవచ్చుని లీకులు ఇచ్చారు. నీటిపారుదల శాఖకు చెందిన అనుచిత చెల్లింపులకు సంబంధించి నిర్దుష్టమైన ఆధారాలు కేంద్ర ప్రభుత్వ వద్ద ఉన్నాయిన బిజెపి నేతలు బాహాటంగగానే చెబుతున్నారు. జైలుకు పంపుతామని పదేపదే చెబుతూ వచ్చారు. ఆంధ్రప్రదేశ్ విషయం ఎలా ఉన్నప్పటికీ తెలంగాణలో అధికారంలోకి రావాలని బీజేపీ పట్టుదల ఇప్పుడు మరింతగా పెరిగింది. తమ బలం పెరిగిందన్న ధీమాలో ఉన్నారు. కాంగ్రెస్‌కు తామే ప్రత్యామ్నాయం అని చెబుతున్నారు. ఇకపోతే బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి బీజేపీతోనే సాధ్యమని రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. సాధారణ కార్యకర్త సైతం అత్యున్నత పదవిని అందుకోవడం బీజేపీలోనే జరుగుతుందని చెప్పారు. తెలంగాణ అభివృద్ధిపై బీజేపీ ప్రత్యేక దృష్టి సారించిందని అంటున్నారు. బీజేపీకి కులం, మత భేదాల్లేవని.. పేదరికమే ప్రాథమికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తామని వెల్లడించారు. ప్రజాధనాన్ని తన కోసం కేసీఆర్ దుబారా చేయడాన్ని ప్రజలు సహించలేదని, అందుకే ఎన్నికల్లో ఓడించారని అన్నారు.

## ప్రభుత్వం ఏర్పడక ముందే దాడులు

అమరావతి,ఎపిలో కొత్త ప్రభుత్వం ఏర్పడక ముందే తెలుగుదేశం పార్టీ దాడులతో రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత భయానక వాతావరణం నెలకొందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఏర్పాటుకాక ముందే టీడీపీ మూకలు స్వైరవిహారం చేస్తున్నాయన్నారు. ఈ మేరకు గురువారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.'రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ దాడులతో అత్యంత భయానక వాతావరణం నెలకొంది. ప్రభుత్వం ఏర్పాటుకాకముందే టీడీపీ మూకలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఎక్కడికక్కడ గ్రామ సచివాలయాలు, ఆర్బీకేల్లాంటి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలకు రక్షణ లేకుండా పోయింది. అధికారపార్టీ ఒత్తిళ్లతో పోలీసు వ్యవస్థ నిస్తేజంగా మారిపోయింది. వెరసి ఐదేళ్లుగా పటిష్టంగా ఉన్న శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రాష్ట్ర గవర్నర్ వెంటనే జోక్యం చేసుకుని పచ్చమూకల అరాచకాలను అడ్డుకోవాలని, ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు, ప్రభుత్వ ఆస్తులకు రక్షణగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. టీడీపీ దాడుల కారణంగా నష్టపోయిన ప్రతి కార్యకర్తకూ, సోషల్ మీడియా సైనికులకు తోడుగా ఉంటాం' అని జగన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ పార్టీ ఘోర పరాజయం పాలైన విషయం తెలిసిందే. 175 అసెంబ్లీ స్థానాలకు కేవలం 11 స్థానాల్లో మాత్రమే గెలిచింది. ఇక తెలుగుదేశం పార్టీ 135 స్థానాల్లో అఖండ విజయంతో అధికారం చేపట్టేందుకు సిద్ధమైంది. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి ఏకంగా 164 స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో ఓటమిని అంగీకరిస్తూ జగన్ సీఎం పదవికి రాజీనామా చేసేశారు. ఇక ఈనెల 12న రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలుస్తోంది.

## భారీగా ఆశావహులు..

అమరావతి : రాష్ట్రంలో టిడిపి కూటమి అతికొద్ది రోజుల్లోనే కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్న నేపథ్యంలో మంత్రివర్గంలో స్థానం కోసం ఎవరి ప్రయత్నాల్లో ఉన్నారు. టిడిపి, జనసేన, బిజెపి సభ్యులతో ఉమ్మడిగా క్యాబినెట్ ఏర్పాటవుతుందనే చర్చ జరుగుతోంది. మంత్రులకు 25 మందికి అవకాశం ఉంది. వీటిలో పార్టీల వారీగా ఎన్ని అనేది తేలాల్సి ఉంది. టిడిపి నుంచి మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు పేరు మాత్రం మొదటి వరుసలో ఉంది. ఆయనకు గతంలో లానే ఆర్థిక, న్యాయ శాఖలు అప్పగించే అవకాశం ఉంది. 2019 నుండి 2024 వరకు అసెంబ్లీలో ప్రతిపక్ష సభ్యులుగా కీలకపాత్ర పోషించిన వారికి తొలి ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉందని తెలిసింది. ఉమ్మడి జిల్లా నుంచి శ్రీకాకుళం జిల్లా నుంచి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఇద్దరిలో ఒకరికి ఇచ్చే అవకాశం ఉంది. విజయనగరం నుంచి మాజీ మంత్రులు కిమిడి కళా వెంకట్రావు, కె మురళీమోహన్, ఆర్‌విఎస్‌కె రంగారావు, అదితి గజపతిరాజు ఆశిస్తున్నట్లు తెలిసింది. విశాఖపట్నం నుంచి వంగలపూడి అనిత, చింతకాయల అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావుకు అవకాశం ఉందని చెబుతున్నారు. తూర్పు గోదావరి జిల్లా నుంచి మాజీమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జ్యోతుల నెహ్రూ, వేగుళ్ల జోగేశ్వరరావు రేసులో ఉన్నారు. పశ్చిమ గోదావరి నుంచి పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు, పితాని సత్యనారాయణ, ఉమ్మడి కృష్ణా నుంచి కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారధిలో ఇద్దరిలో ఒకరికి, గద్దె రామ్మోహన్‌రావు, బొండా ఉమామహేశ్వరరావు, మైలవరం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పోటీపడుతున్నారు. గుంటూరు నుంచి రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మహిళా కోటాలో గుంటూరు పశ్చిమ నుంచి భారీ మెజార్టీతో గెలిచిన గళ్ల మాధవి రేసులో ఉన్నారు. ప్రకాశం నుంచి అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవి, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, కొండెపి ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయస్వామి పేర్లు వినిపిస్తున్నాయి. వీరిలో బాల వీరాంజనేయస్వామి గత అసెంబ్లీలో తన వాణిని వినిపించారు. నెల్లూరు జిల్లా నుంచి మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, పి నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిల పేర్లు రేసులో ఉన్నాయి. ఈ జిల్లాకు రెండు మంత్రి పదవులు ఖాయంగా దక్కుతున్నాయి. కడప జిల్లా నుంచి కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, కర్నూలు జిల్లా నుంచి టిజి భరత్, మైనార్టీ కోటాలో ఎన్‌ఎండి ఫరూక్, కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పేర్లు వినిపిస్తున్నాయి. అనంతపురం జిల్లా నుంచి ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత రేసులో ఉన్నారు. చిత్తూరు నుంచి పలమనేరు ఎమ్మెల్యే ఎన్ అమర్‌నాథ్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. పిఠాపురం సీటు జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు త్యాగం చేసిన వర్మకు ఎమ్మెల్సీ ఇచ్చే అవకాశం ఉంది.

# నిలబెట్టేవారికి మోడీ నంబర్ గేమ్ సంకేతం

న్యూఢిల్లీ,పదేళ్ల కిందట సంకీర్ణ ప్రభుత్వాలకు చెక్ పెడుతూ ప్రజలు విస్పష్టమైన తీర్పు చెప్పారు. పేరుకే ఎన్డీఏ అయినా బీజేపీకి ప్రభుత్వ ఏర్పాటునకు అవరమైన మెజారిటీ ఉండటంతో ఆ కూటమిలోని పార్టీలన్నీ నామమాత్రంగానే మిగిలిపోయాయి. మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ అజెండాను అమలు చేసినా మౌనంగానే ఉన్నాయి. మొదటి ఐదేళ్ల కంటే రెండోసారి బీజేపీ సొంతంగా 300 మార్క్ దాటడంలో ఇక బీజేపీ నేతల విద్వేష వ్యాఖ్యలు, గోరక్షణ పేరుతో ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకోవడంతో మత ఘర్షణలు చోటు చేసుకున్నాయి. భారత్‌లో నెలకొన్న మత రాజకీయాలపై అంతర్జాతీయంగా విమర్శలు వచ్చినా లెక్క చేయలేదు. విపక్ష నేతలు, ప్రజాస్వామికవాదులు ప్రశ్నిస్తే దేశ ద్రోహులుగా చిత్రించారు. ఈ క్రమంలోనే బీజేపీ నినాదాలైన రామ మందిర నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దు, ఉమ్మడి పౌర స్మృతి వంటి వాటిని అమల్లోకి తెచ్చే ప్రయత్నం చేశారు. వీటిలో మొదటి రెండింటిని పూర్తి చేసింది. వాటిని బీజేపీ ఘనతగా చెప్పుకుని వివిధ రాష్ట్రాల్లో రాజకీయంగా లబ్ధి పొందింది. దీనివల్ల బీజేపీ బలోపేతం కావడం, ఆ పార్టీకి మద్దతు ఇచ్చిన ప్రాంతీయ పార్టీలు బలహీనపడటం ప్రారంభమైంది. ఇదంతా ఒక వ్యూహాత్మకంగా అమలు చేశారు. స్వతహాగా ప్రాంతీయపార్టీల ఎదుగుదలను అంగీకరించని మోడీ మెల్లగా ప్రాంతీయపార్టీలను దెబ్బతీశాడు. ఆ విశ్వాసంతోనే ఈసారి ఎన్నికల్లోనూ ఎన్డీఏకు 400పైగా సీట్లు వస్తాయని, బీజేపీ సొంతంగా 370 సీట్లు దక్కించుకుంటుంది అని అనుకున్నాయి. బీజేపీకి కేంద్రంలో రెండుసార్లు స్పష్టమైన మెజారిటీ రావడానికి కారణమైన యూపీలోనే ఇండియా కూటమి దెబ్బతీసింది. 2019లో 62 స్థానాలు గెలుచుకున్న ఆపార్టీ 29 సీట్లు కోల్పోయి 33 స్థానాలకే పరిమితమైంది. రామమందిర నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దు, త్రిపుల్ తలాఖ్, సీఏఏ, సర్జికల్ స్ట్రైక్స్ వంటి ప్రచార నినాదాలతో తమకు గణనీయంగా ఓట్లను రాలుస్తాయని 70కి పైగా సీట్లు గెలుస్తామని అంచనా వేసింది. వాటిని యూపీ ఓటర్లు పట్టించుకోలేదు. చివరికి అయోధ్య జిల్లాలోని ఫైజాబాద్‌లోనే ఆ పార్టీ అభ్యర్థి 54,567 ఓట్ల తేడాతో ఎస్పీ అభ్యర్థి చేతిలో ఓడిపోయాడు. అలాగే సుల్తాన్‌పూర్‌లో బీజేపీ అభ్యర్థి మేనకాగాంధీ ఎస్పీ అభ్యర్థి రాంభూపాల్ నిషాద్ చేతిలో 43,174 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈ రెండు స్థానాల్లో బీజేపీ ఓటమి చెందడానికి కారణం ఆ పార్టీ పదేళ్లు చేస్తున్న నినాదాలను ప్రజలు విశ్వసించలేదు. ఫైజాబాద్, సుల్తాన్‌పూర్ రెండూ పక్కనే ఉంటాయి. కానీ ఫైజాబాద్‌లో బీజేపీ రామనామ జపం చేసింది. సుల్తాన్‌పూర్ ఆ అంశాన్ని పెద్దగా ప్రస్తావించలేదు. మేనకాగాంధీ కూడా స్థానిక సమస్యలపైనే ప్రచారం అయినా ఓటమి తప్పలేదు. దీనికి పదేళ్లుగా మోడీ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి కల్పనలపై దృష్టి సారించకపోవడం, ద్రవ్యోల్బణం కట్టడికి చర్యలు చేపట్టకపోవడం వంటివి ప్రభావం చూపెట్టాయి. ఈ రెండు చోట్ల బీజేపీ ఓడిపోవడానికి కారణం ఆపార్టీ ప్రజలు ఏం కోరుకుంటున్నారో పట్టించుకోకుండా అన్నింటికీ జైశ్రీరాం ఒకటే మంత్రం అన్నట్టు వ్యవహరించింది. భక్తి విశ్వాసాలను రాజకీయాల కోసం వాడుకోవడానికి ప్రజలు తిరస్కరించారు అనడానికి ఇదే నిదర్శనం. దీనిపై బీజేపీ వాట్సప్ యూనివర్సిటీ విష ప్రచారం చేస్తున్నది. హిందువులంతా ఆపార్టీ కార్యకర్తలైనట్లు, ఫైజాబాద్‌లోని ఓటర్లకు బుద్ధి లేదన్నట్టు ప్రచారం చేస్తున్నారు. వాళ్లు ఒక విషయాన్ని మరిచిపోతున్నారు. బీజేపీ పుట్టకు ముందు నుంచే అక్కడ వాళ్లు నివసిస్తున్నారు. వాళ్లు దేవుడి ఆరాధిస్తున్నారు. అక్కడి ప్రజలు ఎవరి మత విశ్వాసాలను వాళ్లు పాటిస్తున్నారు. పదేళ్లుగా మేం ఏం చేయకపోయినా రాముడి పేరు చెప్పి మేము ఓట్లు అడుగుతాం. మీరు వెయాల్సిందే అన్నట్టు మాట్లాడుతున్నారు. అలాగే బీజేపీ గెలిస్తే పాకిస్థాన్‌లో టీవీలు పగలగొడుతారు అని బీజేపీ నేతలు ప్రచారం చేస్తారు. ఫైజాబాద్‌లో బీజేపీ ఓడిపోయాక టీవీలు పగలగొట్టారు. హిందువులు బీజేపీకి అన్యాయం చేశారని ప్రచారం చేయడం మొదలుపెట్టారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం కట్టడి విఫలం, వ్యవసాయ వ్యతిరేక విధానాలు, అగ్నివీర్ పథకంపై యువతలో ఉన్న అసంతృప్తే యూపీ, బీహార్, హర్యానా, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో బీజేపీ సీట్లకు భారీగా గండి కొట్టాయన్న విషయాన్ని పార్టీ నేతలు గ్రహించాలి. అంతేగానీ మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోతే ఓటర్లదే తప్పు అన్నట్టు బీజేపీ వాళ్లు కూడా ప్రజలను నిందించడం హాస్యాస్పదంగా ఉన్నది. ఎన్డీఏ



భాగస్వామ్యపక్షాల సమావేశంలో ప్రధాని మోడీ రాజకీయాల్లో నంబర్ గేమ్ ఒక భాగమే అని కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రమాణ స్వీకారం తర్వాత ప్రభుత్వం మెల్లగా కుదుటపడ్డాక. నంబర్ గేమ్ రాజకీయం మొదలుపెట్టి బీజేపీ యేతర ప్రభుత్వాలను గతంలో వలె కూల్చే కుట్రలు చేసే అవకాశమూ లేకపోలేదు. మోడీ–షా రాజకీయ వ్యూహాలను ఎప్పటికప్పుడు పసిగట్టకపోతే ముందు మునిగేది టీడీపీ, జేడీయూలే. ఎందుకంటే దేశ ప్రజలు మోడీకి వ్యతిరేకంగా తీర్పు చెప్పారు అని ఇండియా కూటమి ఇప్పటికే ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఆర్థిక అభివృద్ధి ద్రవ్యోల్బణ కట్టడి, నిరుద్యోగ సమస్య అభివృద్ధి అంశాల ఎజెండాగా సంకీర్ణ ప్రభుత్వం ముందుకు వెళితే ఎలాంటి ఇబ్బంది ఉండదు. మంత్రివర్గ స్థానాలపై కూడా కూటమిలో పెద్దగా పేచీ ఉండకపోవచ్చు. అవినీతికి వ్యతిరేకంగా ఎన్డీఏ ప్రభుత్వం గట్టిగా పనిచేస్తుంది అన్నారు. కానీ ఎన్డీఏలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ఏం చర్యలు తీసుకున్నారు అంటే సమాధానం ఉండదు. కానీ దీన్ని మోడీ, షా అవకాశంగా తీసుకొని రాజకీయాలకు వాడుతారన్నది పదేళ్ల అనుభవం కళ్లముందున్నది. . మిత్రలాభం పాటిస్తూనే తగిన సమయం చూసుకొని బయటకు పంపుతారు. ఆయా పార్టీలలో మునలం తయారుచేస్తారు. అలాగే మోడీ స్వభావరీత్యా ప్రాంతీయ పార్టీలు బలోపేతం అవడానికి ఇష్టపడడు. అందుకే భాగస్వామ్య పక్షాలైనా శివసేన, అకాలీదళ్, అన్నాడీఎంకే, ఎల్జేపీ, పీడీపీ, తాజాగా జేజేపీ ఇలా అన్నిపార్టీల్లో చీలక తెచ్చాడు. కనుక రానున్న రోజుల్లో ఏమైనా జరగొచ్చు. బీజేపీ తాను బలోపేతం కావడానికి ప్రాంతీయపార్టీలను, భాగస్వామ్య పార్టీలైనా బలి చేయడానికి వెనుకాడదు. రానున్న రోజుల్లో మహారాష్ట్ర, బీహార్, హర్యానాలోనూ బీజేపీ సొంతంగానే మెజారిటీ సాధించేలా ఇప్పటి నుంచే వర్క్ ఔట్ చేస్తారు. కీలక బిల్లులు పాస్ కావాలంటే ఈ రాష్ట్రాల్లో అధికారంలోకి వస్తే పెద్దల సభలోనూ సంఖ్యా బలం పెరుగుతుందనేది కాషాయపార్టీ ఆలోచన. మహారాష్ట్రలో శిండే వర్గాన్ని, బీహార్‌లో జేడీయూను బలహీనపరిచడానికి ప్రయత్నాలు మొదలుపెడుతారు. మహారాష్ట్రలో దేవేంద్ర ఫడ్నవీస్ ఉప ముఖ్యమంత్రి బాధ్యతల నుంచి తప్పించాలన్న సంకేతాలు అవే. పదేళ్లు మోడీ ఏం చేసినా దేశం కోసమే అన్న ప్రచారం ఇక నడువదు. దాన్ని ప్రజలు విశ్వసించడం లేదని తాజా ఎన్నికల ద్వారా తేటతెల్లమైంది. దానికి కారణం సంపూర్ణ మెజారిటీ ఉండటంతో పదేళ్లు ఎన్ని ప్రజా వ్యతిరేక విధానాలు తీసుకున్నా ఎన్డీఏ పక్షాలే కాదు వైసీపీ, టీడీపీ, బీఆర్ఎస్ వంటి పార్టీలు మద్దతు ఇచ్చాయి. ఇప్పుడు అలాంటి పరిస్థితి ఉండదు. పార్లమెంటులోనూ ప్రతిపక్షం గట్టిగానే ఉన్నది. అలాగే పదేళ్లుగా జాతీయ మీడియాలో కొన్ని ఛానళ్లు నమో జపం చేశాయి. మొన్నటి ఫలితాలతో సీన్ మారింది. ఇక కాంగ్రెస్‌పై , ఇండియా కూటమిలోని పక్షాలపై కాకుండా బీజేపీ విధానాలపై చర్చలు మొదలవుతాయి. కాంగ్రెస్ ఓడిపోతే ఖర్గే మీద తోసేస్తారు అని మోడీ సహా బీజేపీ నేతలు ఎద్దేవా చేశారు. కానీ ఫలితాల తర్వాత ఇండియా కూటమి నేతల్లో ఉన్న విశ్వాసం బీజేపీలో లేదు. మోడీలో అసలే లేదు. ఎందుకంటే ఇప్పుడు ఎన్డీఏ కూటమిలో కీలకంగా ఉన్న టీడీపీ, జేడీయూ అధినేతలను ఉద్దేశించి గతంలో ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియా వైరల్ అవుతున్నాయి. మోడీ చెప్పేది ఒకటి చేసేది ఒకటి అన్నది వాటి సారాంశం. ఎందుకంటే నిలబెట్టే వారికి రాజకీయాల్లో నంబర్ గేమ్ భాగమే అని మోడీ చెప్పారు. ప్రస్తుతం త్వరలో కొలువుదీరనున్న మోడీ నేతృత్వంలోని కొత్త ప్రభుత్వ భవితవ్యం ప్రాంతీయపార్టీల చేతిలో ఉన్నది. బీజేపీ బలపడితే నిలబెట్టిన పార్టీలనే నిండా ముంచుతుంది అన్నది చరిత్రే.

# విద్యా,వైద్యరంగాలను సంస్కరించాలి

న్యూఢిల్లీ, దేశంలోనిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. ఆరోగ్యం అందని ద్రాక్షగా మారింది. విద్య విలాసవస్తువుగా మారింది. ఇలాంటి అసమానతలను రూపుమాపేందుకు సంకీర్ణ పాలకులు చిత్తశుద్ధితో కృషి చేయాలి. ఇప్పుడు కేవలం బిజెపి పాలనలాగా కాకుండా ఎన్‌డిఎ పాలనలాగా అన్ని పార్టీలు బాధ్యతతో వ్యవహరించాల్సి ఉంది. ఆనాటి పాలకుల దూరదృష్టి లోపం కారణంగా మనకు వారసత్వంగా వచ్చిన సకల అవలక్షణాలు ప్రజలను ఇంకా దరిద్రంలోనే ముంచెత్తుతున్న వేళ పాలకులు గతాన్ని నెమరేసుకుని ముందుకు సాగాల్సిన వేళ ఇది. ఇంతకాలం ఎక్కడ లోపం ఉందో గుర్తించి అవలోకనం చేసుకోవాలి. ఆత్మపరిశీలన చేసుకోవాలి. విద్యావైద్యరంగం ఎందుకు వెనకబడి ఉందో తెలుసు కోవాలి. ఆహారధన్యాలను ఇంకా ఎందుకు దిగుమతి చేసుకుంటున్నామో ఆలోచన చేయాలి. రాజకీయ దృక్కోణంలో కాకుండా అభివృద్ధి కోణంలో పాలన చేయాల్సిన విషయాన్ని పాలకులు వంటబట్టించు కోవాల్సి ఉంది. గ్రామాలను విద్య,వైద్యపరంగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందేలా చేయాలి. దేశీయంగా ఉన్న సాంకేతికతను ఉపయోగించుకుని యువతను స్వయం సమృద్ధికి సన్నద్ధం చేయాలి. వ్యవసాయం, అనుబంధ రంగాలను అభివృద్ధి చేస్తే ఈ దేశం ఇతర దేశాలకు ఆహారధాన్యాలను ఎగుమతి చేయగలదు. సింగపూర్, మలేషియా తదితర చిన్నదేశాలను ఆదర్శగా తీససుకుని ఆయా రాష్ట్రాలు స్వయం సమృద్ధి సాధించే ప్రణాళికలతో సాగాల్సిన అవసరాన్ని గుర్తించాలి. ప్రజలు సంపూర్ణత సాధించేలా పథకాలు అమలు కావడం లేదు. ఐదేళ్లు అధికారంలోకి రాగానే మరో ఐదేళ్లు గద్దెపై ఉండడ మెలా అన్న ఆలోచన చేయడం వల్లనే భారత్ కూడా ఇంకా దారిద్ర్యం, నిరక్షరాస్యత, వసతుల కొరత, ఆహారధాన్యాల కొరతతో అలమటి స్తోంది. ఇదంతా పాలకుల దృష్టి లోపంగా చూడాలి. నిజానికి దేశంలో నల్లధనం, అవినీతి పోవాలంటే రాజకీయ పార్టీల నుంచే ప్రక్షాళన మొదలవ్వాలి. నల్లధనం రూపంలో రాజకీయ పార్టీలు విరాళాలు తీసుకుని ఓటర్లను కొనుగోలు చేయడానికి వాడుతున్నాయి. ఎన్నికలు అయ్యాక తగిన మెజారిటీ సమకూరని సందర్భాలలో ఎమ్మెల్యేలు లేదా ఎంపీల బేరసారాల కోసం ఈ నల్లధనాన్నే వాడుతున్నారు. వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు రాజకీయ పార్టీలకు ఇస్తున్న విరాళాలలో అత్యధిక భాగం నల్లడబ్బు రూపంలోనే ఉంటోంది. ఈ పరిస్థితిని నివారించకుండా ఎన్ని సంస్కరణలు చేసినా ఫలితం ఉండదు. ఎన్నికల్లో ఆయా పార్టీలు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న వైనం చూస్తున్నాం. ఇంతగా డబ్బు ఎక్కడి నుంచి వస్తుందో గమనించాలి. రాజకీయాలు చేసేవారికి వస్తున్న డబ్బుపై దృష్టి సారించాలి. అన్నిరంగాల్లో మనం ముందంజ వేయాల్సిన దశలో ఇంకా దిగుబడులపై ఆధారపడుతూ ఎగుమతుల విషయంలో లక్ష్యం లేకుండా సాగుతున్నాం. మనం చేపట్టిన సంస్కరణలు ఫలితాలు ఇవ్వడం లేదన్న విషయాన్ని గుర్తించడం లేదు. ఎన్నికలలో డబ్బు అవసరం లేకుండా సంస్కరణలు తీసుకు రాకుండా ఎన్ని చర్యలు తీసుకున్నా లాభం లేదు. రాజకీయ పార్టీల ప్రధాన లక్ష్యం అధికారమే కనుక, ఆ అధికారం కోసం ఎంతకైనా తెగబడతాయని ఈ 75 ఏళ్లలో నిరూపితం అయ్యింది. నీతి ఆయోగ్‌ను బలోపేతం చేస్తూ రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకుని ఉమ్మడిగా ముందుకు సాగాల్సి ఉంది. అప్పుడే దేశం అభివృద్ధి సాధిస్తుందని గుర్తించాలి.

## ఇది ఎవరి పతనానికి సంకేతం?

న్యూఢిల్లీ,ఇండియా బ్లాక్‌కు ఈ ఎన్నికల్లో వచ్చే సీట్లు ఎన్ని? ఈ ప్రశ్నకు అన్ని ఎగ్జిట్ పోల్స్ 200కు లోపే అని తేల్చి చెప్పాయి. ఏ ఒక్క ఎగ్జిట్ పోల్ కూడా 200 దాటుతాయని చెప్పలేదు. బట్ అందరి అంచనాలను తలకిందులు చేసింది ఇండియా కూటమి. ఇంతకీ ఈ స్థాయిలో సీట్లు దక్కడం వెనక రీజన్సేంటి ? కూటమి సీట్ల సంఖ్య పెరగడం దేనికి సంకేతం ?ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయెన్స్. సింపుల్‌గా ఇండియా కూటమి. ఈ కూటమి గెలిచిన సీట్ల సంఖ్య 234. అంటే మ్యాజిక్ ఫిగర్‌కు అత్యంత దగ్గరగా వచ్చింది కూటమి. దీనిని ఎవరూ ఎక్స్‌పెక్ట్ చేయలేదు. అంటే దేశ వ్యాప్తంగా మోడీ మ్యాజిక్ తగ్గింది అని చెప్పకనే చెబుతోంది ఈ ఫలితం. ఇందులో కాంగ్రెస్ గెలిచిన సీట్ల సంఖ్య 99. ఆ తర్వాత యూపీలో బీజేపీ నడ్డి విరిచి సమాజ్‌వాదీ పార్టీ ఏకంగా 37 సీట్లను గెలుచుకుంది. ఆ తర్వాత తృణమూల్ 29 సీట్లు.. డీఎంకే 22 సీట్లతో ఉన్నాయి. అంటే కూటమిలో ఉన్న ప్రతి పార్టీ బలపడింది. 2014లో కాంగ్రెస్ గెలిచిన సీట్లు 52 మాత్రమే. కానీ ఇప్పుడు ఆ నంబర్ ఆల్‌మోస్ట్ డబుల్ అయ్యింది. అంటే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనే కాదు. కాంగ్రేసేతర పాలిత రాష్ట్రాల్లో కూడా కూటమికి అవకాశాలు మెరుగయ్యాయి. అయోధ్య, పాకిస్థాన్, చైనా పేరుతో చేసిన రాజకీయం అంతగా ప్రభావితం చూపలేదు. పేదరికం, నిరుద్యోగం, రిజర్వేషన్ల రద్దు, సామాజిక, ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయంటూ కూటమి చేసిన ప్రచారం ఫలితం చూపించింది. ఎట్ ది సేమ్ టైమ్.. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో స్ట్రాటజీని ఫాలో అవుతూ.. బీజేపీకి అడ్డుకట్ట వేసేందుకు పని చేశారు కూటమి నేతలు. యూపీపై ఇండియా కూటమి మేజర్‌గా ఫోకస్ చేసింది. అవసరమైతే తమకు ఒక్క సీటు ఇవ్వకపోయినా.. మద్దతించేందుకు కాంగ్రెస్ రెడీ అయ్యింది. తమిళనాడులో డీఎంకేకు ఎదురులేకపోవడం కలిసి వచ్చింది. కేరళలో బీజేపీ బలహీనంగా ఉండటం కూడా పాజిటివ్ అంశమే అని చెప్పాలి. మహారాష్ట్రలో కూడా ఎన్డీఏను మట్టికరిపించింది ఇండియా కూటమి. అంతేకాదు బీజేపీలో చేరికలు.. ఈడీ, సీబీఐ రెయిడ్స్.. ఎలక్టోరల్ బాండ్స్.. కొంతమంది వ్యాపారవేత్తలకు మాత్రమే పెద్ద పీట వేయడం. ఇలా ప్రతి అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాయి కూటమి నేతలు. దీంతో ప్రజల ఆలోచన విధానం మారింది. అబ్ కీ బార్ చార్ సౌ బార్.. అంటూ మోడీ చేసిన ప్రచారం ప్రచారానికే పరిమితం చేయడంలో సక్సెస్ అయ్యింది ఇండియా కూటమి. మరి కూటమి మెజారిటీ మార్క్‌ను ఎందుకు చేరుకోలేకపోయింది.. ? దీనికి ఆన్సర్ సింపుల్.. సరైన ఐక్యత లేకపోవడం. దీనికి పూర్తిగా కాకపోయినా.. కొంచమైనా ఇద్దరిని కారణంగా చెప్పుకోవచ్చు. వారిద్దరు మరేవరో కాదు.. ఒకరు అరవింద్ కేజ్రీవాల్.. రెండో పర్సన్ మమతా బెనర్జీ.. వీరిద్దరు అందితే కాళ్లు.. లేకపోతే జుట్టు.. అన్నట్టుగా వ్యవహరించారని చెప్పవచ్చు. ఢిల్లీలో ఉన్న ఏడు లోక్‌సభ స్థానాలను క్లీన్ స్వీప్ చేసింది బీజేపీ. అంటే కేజ్రీవాల్ మ్యానియా అస్సలు పనిచేయలేదని చెప్పవచ్చు. లిక్కర్ స్కామ్‌లో అరెస్టైన కేజ్రీవాల్.. ఆ సింపతి ఫుల్‌గా వర్కౌట్ అవుతుందని ఆశించి భంగపడ్డారు. తన బరువు దగ్గరి నుంచి మొదలు పెడితే.. ప్రచారం మొత్తాన్ని తన చుట్టూనే తిప్పారు. కానీ ప్రజలు దాన్ని అస్సలు రిసీవ్ చేసుకోలేదని క్లియర్ కట్‌గా అర్థమవుతోంది. ఈ రిజల్ట్ ఆయనకు ఓ కనువిప్పు అనే చెప్పాలి. ఎన్నికలకు ముందు వరకు కేజ్రీవాల్ తనను తాను చాలా గొప్పగా ఊహించుకున్నట్టు కనిపించింది. కూటమికి నా అవసరం ఉంది తప్ప.. నా అవసరం కూటమికి లేదు. అన్నట్టుగా ఉండేది.. బట్ ఆ అంచనా తప్పింది. సెకండ్.. మమతా బెనర్జీ.. బెంగాల్ నా గడ్డ.. అడ్డా అన్నట్టుగా వ్యవహరించారు దీదీ. అంతేకాదు.. ఇక్కడ సీట్ షేరింగ్‌కు అస్సలు అంగీకరించలేదు. దీంతో గట్టి దెబ్బ పడింది.. మొత్తం 42 సీట్లలో కూటమి 30 సీట్లకే పరిమితమైంది. నెక్స్ట్ గట్టిగా దెబ్బ పడింది. బిహార్‌లో ఈ రాష్ట్రంలో కూడా %చీణా% కూటమి హవా కొనసాగింది. మెజార్టీ సీట్లు NDA ఎగరేసుకుపోయింది. దీంతో కూటమికి కోలుకోలేని దెబ్బ పడింది.

# ఏ విడుతలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు?



న్యూఢిల్లీ: 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఎన్డీయేకు, ప్రత్యేకించి బీజేపీకి మింగుడుపడేవి కావు. 2014లో 282, 2019 ఎన్నికల్లో 303 సీట్లు గెలుచుకున్న బీజేపీ.. చాలా తక్కువ మంది అంచనా వేసిన విధంగా 240 సీట్లకు పడిపోయింది. మరోవైపు 2014లో 44 సీట్లకు పరిమితమై, 2019లో 52 సీట్లకు మాత్రమే పెరిగిన కాంగ్రెస్.. ఈ ఎన్నికల్లో తన సత్తా చాటి.. 99 స్థానాల్లో విజయకేతనం ఎగురవేసింది. ఇండియా కూటమి భాగస్వామ్య పక్షం సమాజ్‌వాది పార్టీ గత ఎన్నికల్లో ఐదు సీట్ల నుంచి ఇప్పుడు ఏకంగా 37 స్థానాలకు తన బలాన్ని పెంచుకున్నది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిలో రెండో అతిపెద్ద పార్టీగా అవతరించిన టీడీపీ 16 సీట్లు గెలుచుకున్నది. ఇదే పార్టీకి 2014లో కూడా ఇదే సంఖ్యలో సీట్లు వచ్చాయి. కానీ.. 2019లో మూడింటికి పరిమితమైంది. మొత్తంగా బీజేపీ 63 సీట్లను చేజార్చుకున్నది. అంటే గతంలో పోల్చితే 21 శాతం సీట్లు కోల్పోయింది. ఇది కూడా కేవలం – 0.77 శాతం తేడాతో కావడం గమనార్హం. కాంగ్రెస్ 1.72 శాతం ఓట్లు పెంచుకుని.. 90శాతం పురోగతితో 47 సీట్లను అదనంగా పొందింది. ఏపీలో అత్యధిక స్థానాలు గెలుచుకుని, ఒడిశాలో ఐదు పర్యాయాలుగా ముఖ్యమంత్రిగా ఉన్న నవీన్ పట్నాయక్‌ను ఓడించింది. కానీ.. పశ్చిమబెంగాల్‌లో పుంజుకోలేక పోయింది. అటు ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలో భారీగా ఎదురుదెబ్బలు తిన్నది. తమిళనాడులో బీజేపీకి ఒక్క స్థానం కూడా లభించలేదు. అటు మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ పరిస్థితి కూడా అదే.

మొత్తంగా ఏ దశలో ఏ పార్టీ గెలిచిందో చూస్తే..

తొలి దశ..

తొలి దశలో 102 సీట్లకు పోలింగ్ నిర్వహించగా.. బీజేపీ 30 సీట్లు గెలుచుకున్నది. ఇదే తొలి దశలో బీజేపీ 40 సీట్లు గెలుచుకున్నది. కాంగ్రెస్ గత ఎన్నికల్లో 15 సీట్లు గెలిస్తే.. ఈసారి 27 సీట్లకు పెరిగింది.

రెండో దశ..రెండో దశలో బీజేపీ గత ఎన్నికల్లో 52 సీట్లు గెల్చుకోగా, 2024 ఎన్నికల్లో 47కు పరిమితమైంది. కాంగ్రెస్‌కు గతంలో 18 సీట్లు ఉండగా.. ఇప్పుడు అవి 23కు పెరిగాయి.

మూడో దశ...

మూడో దశలో బీజేపీ గణనీయంగా దెబ్బతిన్నది. ఈ దశలో గతంలో 72 సీట్లు గెలిచిన బీజేపీ.. ఈసారి 58 సీట్లకు పరిమితమైంది. మరోవైపు కాంగ్రెస్ తన సంఖ్యాబలాన్ని నాలుగు నుంచి 15కు పెంచుకోగా, కాంగ్రెస్ మిత్రపక్షం సమాజ్‌వాది పార్టీ 2 సీట్ల నుంచి ఆరు సీట్లకు పెరిగింది.

నాలుగో దశ...నాలుగో దశ ఎన్నికల్లో గతంలో 42 సీట్లు ఉన్న బీజేపీ.. 2024 ఎన్నికల్లో 39 సీట్లకు తగ్గింది. కాంగ్రెస్ గతంలో ఆరు సీట్లు ఉంటే.. ఈసారి 14 సీట్లలో గెలుపొందింది.

ఐదో దశ ..

ఐదో దశలోనూ బీజేపీకి భారీ ఎదురుదెబ్బలు తగిలాయి. 2019లో ఆ పార్టీ ఈ దశలో 32 సీట్లు గెలిస్తే.. ఇప్పుడు 18 సీట్లకు తగ్గిపోయింది. కాంగ్రెస్ ఒక్క స్థానం నుంచి నాలుగు సీట్లకు పెరిగింది. సమాజ్‌వాది పార్టీకి గతంలో ఈ దశలో ఒక్క సీటు కూడా లభించని పరిస్థితిలో ఇప్పుడు ఏకంగా ఏడు సీట్లలో జయకేతనం ఎగురవేసింది.

ఆరో దశ..

2019లో ఆరో దశ పోలింగ్‌లో 40 సీట్లలో విజయం సాధించిన బీజేపీ.. 2024కు వచ్చేసరికి 31 సీట్లకు తగ్గిపోయింది. మరోవైపు ఒక్క సీటు కూడా లేని కాంగ్రెస్ ఆరు సీట్లో గెలిచింది. సమాజ్‌వాది పార్టీ ఒక సీటు నుంచి పది సీట్లకు పెరిగింది.

ఏడో దశ...

ఈ దశలో కూడా బీజేపీ గణనీయంగా ఎదురుదెబ్బలు తిన్నది. 2019లో ఆ పార్టీకి 25 సీట్లు ఉంటే.. ఇప్పుడు 17కు పడిపోయాయి. కాంగ్రెస్‌కు గతంలో ఈ దశలో 8 సీట్లు ఉంటే.. ఈసారి అదనంగా ఒకటి గెలిచింది. సమాజ్‌వాది పార్టీకి గతంలో ఈ దశలో ఒక్క సీటు కూడా లేదు. కానీ.. ఈసారి ఏకంగా ఆరు సీట్లలో విజయం సాధించింది.

## పాలేరు వాగులో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు

నంద్యాల,నంద్యాల జిల్లాలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. బనగానపల్లె, కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల మండలాల్లో కురిసిన వానకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సంజామల వద్ద పాలేరు వాగు పొంగి ప్రవహిస్తోంది. కోయిలకుంట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వరద నీటిలో చిక్కుకుంది.

# ఏపీ, బీహార్‌కు ప్రత్యేక హోదా ఇస్తారా?



న్యూఢిల్లీ: కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ ఏర్పాటుకు కీలకమైన టీడీపీ, జేడీయూ అనేక ఏండ్లుగా డిమాండ్ చేస్తున్న ఆంధ్రప్రదేశ్, బీహార్‌లకు ప్రత్యేక ప్రతిపత్తిని బీజేపీ నెరవేరుస్తుందా? అని కాంగ్రెస్ పార్టీ గురువారం ప్రశ్నించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్‌లో ఒక వీడియో పోస్ట్ చేశారు. కాబోయే కొత్త ప్రధానికి ఆయన అందులో నాలుగు ప్రశ్నలను సంధించారు. 2014 ఏప్రిల్ 30న పవిత్రమైన తిరుపతి నగరంలో మీరు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీని ఇప్పుడు నెరవేరుస్తారా? విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను మీరు ఇప్పుడు నిలిపివేస్తారా? బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడం ద్వారా మీ 2014 నాటి హామీని, మీ మిత్రుడు నితీశ్‌కుమార్ పదేళ్ల డిమాండ్‌ను నెరవేరుస్తారా? బీహార్‌లో మాదిరిగానే దేశవ్యాప్తంగా కులగణనను నిర్వహిస్తారా?' అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై ఢిల్లీలో బీజేపీ నాయకులు మల్లగుల్లాలు పడుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ ఈ ప్రశ్నలు సంధించింది.

బీజేపీ ఈ ఎన్నికల్లో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీని సొంతంగా దక్కించుకోలేని నేపథ్యంలో తెలుగుదేశం, జేడీయూ నరేంద్రమోదీ మూడో ప్రభుత్వంలో కీలకంగా మారారు. తాము మద్దతు ఇస్తున్నందుకు గాను స్పీకర్ పోస్టు సహా పలు కీలకమైన మంత్రి పదవులపై టీడీపీ నేత చంద్రబాబు నాయుడు, జేడీయూ నేత నితీశ్‌కుమార్ పట్టుపడుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. కేంద్ర క్యాబినెట్‌లో ఆర్థిక శాఖ సహా నాలుగు కీలక పోర్టుఫోలియోలను టీడీపీ ఆశిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. అమరావతిని అభివృద్ధి చేయడంతోపాటు.. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం చంద్రబాబు పట్టుపడుతున్నట్టు తెలుస్తున్నది. లోక్‌సభ ఎన్నికల్లో ఏపీలోని 25 సీట్లకు గాను టీడీపీ నేతృత్వంలోని కూటమి 21 స్థానాలు కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే.. జేడీయూ నేత నితీశ్ కుమార్‌కు 12 స్థానాలు లభించాయి. ఆయన రైల్వే, గ్రామీణాభివృద్ధి, జల వనరుల శాఖలను కోరుతున్నట్టు తెలుస్తున్నది. వీటితోపాటు మూడు సహాయ మంత్రి పదవులను కూడా అడుగుతున్నారని సమాచారం. జూన్ 9వ తేదీన ప్రధాన మంత్రిగా మూడోసారి నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈలోపు ప్రత్యేకించి క్యాబినెట్ కూర్పుపై టీడీపీ, జేడీయూల డిమాండ్లు ఏ మేరకు నెరవేరుతాయనే ఆసక్తి రెండు రాష్ట్రాల ప్రజల్లో నెలకొని ఉన్నది.

# ప్రభుత్వం ఏర్పాటు కాకముందే ఎన్డీయే కూటమిలో కాక మొదలు

న్యూఢిల్లీ, కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు కాకముందే ఎన్డీయేలో మొదలైంది. ఇప్పటిదాకా ఎన్డీయేలో బీజేపీ ఏ నిర్ణయం తీసుకొన్నా ఎదురులేకుండా పోయేది. కానీ, ఇప్పుడు ప్రభుత్వ ఏర్పాటులో బీజేపీకి మిత్రపక్షాల మద్దతు తప్పనిసరి అయ్యింది. ఈ నేపథ్యంలో ఆయా పార్టీలు తమ డిమాండ్లను బీజేపీ ముందు ఉంచుతున్నాయి. తాజాగా, అగ్నిపథ్ పథకంపై ఎన్డీయే భాగస్వామ్య పక్షాలైన జేడీయూ, లోక్‌జన్‌శక్తి (రామ్‌విలాస్ పాశ్వాన్) పార్టీలు కీలక వ్యాఖ్యలు చేశాయి. ఈ పరిశీలన చేయాలని డిమాండ్ చేశాయి.

బేషరతు మద్దతు అంటూనే..

ఎన్డీయేకు బేషరతు మద్దతు తెలుపుతున్నామని.. బీజేపీ ముందు జేడీయూ పలు డిమాండ్లు ఉంచింది. త్రివిధ సమీక్షలో నియామకాల కోసం మోదీ సర్కారు తీసుకొచ్చిన అగ్నిపథ్, జేడీయూ నేత కేసీ త్యాగీ అన్నారు. ఈ పథకంపై చాలా వ్యతిరేకత వ్యక్తమయిందని, ఎన్నికల్లోనూ దీని ప్రభావం పడిందని చెప్పారు. ఈ విషయంలో ప్రభుత్వంతో తాము ఘర్షణ పడాలని కోరుకోవడం లేదని ఆయన.. పథకం తీసుకొచ్చినప్పుడు సాయుధ బలగాలు, వారి కుటుంబ సభ్యుల నుంచి వ్యతిరేకత వ్యక్తమయిందని గుర్తు చేశారు. కాబట్టి చర్చించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అలాగే ఉమ్మడి పౌరస్మృతికి తాము వ్యతిరేకంగా కాదని, అయితే ఒప్పందం అన్ని భాగస్వామ్య పక్షాలతో చర్చించి ఏకాభిప్రాయానికి రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అన్ని కులగణన చేయాలని కోరుతాను. మరోవైపు, ఎల్జేపీ అధినేత చిరాగ్ పాశ్వాన్ కూడా అగ్నిపథ్ సమీక్షించాలని నిర్ణయించారు. ఎన్డీయే విజయానందం తొలిసారి ఓ ఆంగ్ల ఛానల్‌కు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. దేశవ్యాప్త కులగణనకు తాము మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. 'ప్రభుత్వం వద్ద ఈ సమాచారం ఉండటం చాలా అవసరం. అయితే, దాన్ని బహిర్గతం చేయాలా? వద్దా? అంటే చేయొద్దు అంటే చెప్తా. ఎందుకంటే ఆ డాటా బహిర్గతమైతే సమాజంలో విభేదాలు తలెత్తుతాయి' అని వివరించారు.

ఎన్డీయే కన్వీనర్ పోస్టుకు టీడీపీ ఎసరు!

ఎన్డీయేలో బీజేపీ తర్వాత అత్యధిక మెజారిటీ కలిగిన పార్టీ టీడీపీ. ఆ పార్టీ స్పీకర్, పలు మంత్రిత్వ శాఖలను డిమాండ్ చేస్తున్న వార్తలు వచ్చాయి. అయితే, వాటన్నింటికన్నా ఎన్డీయే కన్వీనర్ పోస్టుకే గురి పెట్టినట్టు తెలుస్తున్నది. 'మిత్రపక్షాలు అడిగే డిమాండ్లకు బీజేపీ నాయకత్వం సానుకూలంగా స్పందించే



అవకాశం ఉంది. బీహార్, ఏపీకి ప్రత్యేక ప్యాకేజీ లాంటివి అందించడానికి సిద్ధంగా ఉంటుంది. కానీ, లోక్‌సభ స్పీకర్, ఎన్డీయే కన్వీనర్ లాంటి డిమాండ్లపై సానుకూలత రావచ్చు' అని బీజేపీ సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. అయితే, వాజ్‌పేయి ప్రభుత్వంలో ఎన్డీయే కన్వీనర్‌గా చంద్రబాబునాయుడు వ్యవహరించారు. లోక్‌సభ స్పీకర్‌గా టీడీపీకే అవకాశం దక్కింది. జీసీ బాలయోగి స్పీకర్‌గా వ్యవహరించారు. అయితే, ప్రస్తుత పరిస్థితులలో లోక్‌సభ స్పీకర్, ఎన్డీయే కన్వీనర్ పోస్టులు టీడీపీకి అప్పగిస్తారా? లేదా? అన్నది చూడాలి.

మిత్రపక్షాల నుంచి వెల్లువెత్తుతున్న డిమాండ్లు

ఎన్డీయేలో భాగస్వామి అయిన జేడీయూ కూడా పలు డిమాండ్లను బీజేపీ ముందు ఉంచే అవకాశం ఉంది. జేడీయూ నేత, బీహార్ సీఎం నితీశ్ కుమార్.. బీహార్‌కు ప్రత్యేక హోదాతో పాటు పలు కీలక మంత్రిత్వ శాఖలను కోరుతున్న సమాచారం. గ్రామీణాభివృద్ధిశాఖ, రక్షణ, రైల్వే, వ్యవసాయం సహా రెండు సహాయ మంత్రిత్వశాఖలను కోరుతున్నట్టు తెలుస్తున్నది. రాజ్యసభ వైస్‌చైర్మన్ పోస్టుకు కూడా గాలం వేసినట్టు సమాచారం. ఇక, మరో మిత్రపక్షం జేడీఎస్ కూడా పలు డిమాండ్లను బీజేపీ ముందుంచింది. తమకు వ్యవసాయశాఖపై ఆసక్తి ఉన్నట్టు ఆ పార్టీ నేత హెచ్‌డీ కుమారస్వామి హింట్ ఇచ్చారు. తాము మొదట్నుంచీ రైతుల కోసమే పోరాడుతున్నామని, ఆ శాఖపై తమ పార్టీ ఆసక్తి కనబరుస్తున్నదని. అయితే, శుక్రవారం జరిగే ఎన్డీయే పార్లమెంటరీ సమావేశం తర్వాత ఈ డిమాండ్లపై క్లారిటీ రానున్నది.

# కత్తిమీద సాములా చంద్రబాబు నాయుడు పరిస్థితి

అమరావతి, రాష్ట్రంలో టిడిపి కూటమి అతికొద్ది రోజుల్లోనే కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్న నేపథ్యంలో రాష్ట్రాన్ని గాడిలో పెట్టడంతో పాటు, అప్పులను తీర్చడం కూడా అంతే కష్టం కానుంది. దీనికితోడు ఇప్పుడు ఉమ్మడి ప్రభుత్వాన్ని నడపాల్సి ఉంటుంది. ప్రభుత్వంలో జనసేన, బిజెపిలు భాగస్వామిగా ఉంటాయి. ఈ క్రమంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడం, మంత్రి పదవులను కేటాయించడం కత్తిమీద సాములాంటిదే. టిడిపిలో ఉన్న కొందరిని పక్కన పెడితే తప్ప బిజెపి, జనసేనలకు పదవులు ఇవ్వడం కుదరదు. అలాగే టిడిపిలో ఉన్న వారు కూడా చంద్రబాబు తీసుకునే నిర్ణయాలకు కట్టుబడి నడుచుకుంటేనే ఎపిలో నిర్ణయాలు సక్రమంగా ఉంటాయి. సిఎంగ ఆచంద్రబాబు ప్రమాణ స్వీకారం చేనున్న సందర్భంగా మంత్రివర్గంలో స్థానం కోసం ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు. టిడిపి, జనసేన, బిజెపి సభ్యులతో ఉమ్మడిగా క్యాబినెట్ ఏర్పాటవుతుందనే చర్చ జరుగుతోంది. మంత్రులుగా 25 మందికి అవకాశం ఉంది. వీటిలో పార్టీల వారీగా ఎన్ని అనేది తేలాల్సి ఉంది. సమర్థుడైన వ్యక్తిని స్పీకర్‌గా ఎంచుకోవాల్సి ఉంటుంది. గతంలో ఉమ్మడి ఎపిలో స్పీకర్‌గా పనిచేసిన అనుభవం జనసేన ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్‌కు ఉంది. ఆయన కూడా మంత్రి పదవి రేసులో ఉన్నారు. టిడిపి నుంచి మాజీమంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు పేరు మాత్రం మొదటి వరుసలో ఉంది. ఆయనకు గతంలో లానే ఆర్థిక, న్యాయ శాఖలు అప్పగించే అవకాశం ఉంది. 2019 నుండి 2024 వరకూ అసెంబ్లీలో ప్రతిపక్ష సభ్యులుగా కీలకపాత్ర పోషించిన వారికి తొలి ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉందని తెలిసింది. ఉమ్మడి జిల్లాల వారీగా చూసుకుంటే శ్రీకాకుళం జిల్లా నుంచి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఇద్దరిలో ఒకరికి ఇచ్చే అవకాశం ఉంది. విజయనగరం నుంచి మాజీ మంత్రులు కిమిడి కళా వెంకట్రావు, కె మురళీమోహన్, ఆర్‌విఎస్‌కెకె రంగరావు, అదితి గజపతిరాజు ఆశిస్తున్నట్లు తెలిసింది. విశాఖపట్నం నుంచి వంగలపూడి అనిత, చింతకాయల అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావుకు అవకాశం ఉంటుందని అంటున్నారు. తూర్పు గోదావరి జిల్లా నుంచి మాజీమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జ్యోతుల నెహ్రూ, వేగుళ్ల జోగేశ్వరరావు రేసులో ఉన్నారు. పశ్చిమ గోదావరి నుంచి పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు, పితాని సత్యనారాయణ, ఉమ్మడి కృష్ణా నుంచి కొల్లు రవీంద్ర, కొలుసు పార్ధసారథి లో ఇద్దరిలో ఒకరికి, గద్దె రామ్మోహన్‌రావు, బొండా ఉమామహేశ్వర రావు, మైలవరం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పోటీపడుతున్నారు. గుంటూరు నుంచి రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మహిళా కోటాలో గుంటూరు పశ్చిమ నుండి భారీ మెజార్టీతో గెలిచిన గల్లా మాధవి రేసులో ఉన్నారు. ప్రకాశం నుంచి అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవి, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, కొండెపి ఎమ్మెల్యే డోలా బాల



వీరాంజనేయస్వామి పేర్లు వినిపిస్తున్నాయి. వీరిలో బాల వీరాంజనేయస్వామి గత అసెంబ్లీలో తన వాణిని వినిపించారు. నెల్లూరు జిల్లా నుంచి మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, పి నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిల పేర్లు రేసులో ఉన్నాయి. ఈ జిల్లాకు రెండు మంత్రి పదవులు ఖాయంగా దక్కుతాయని చెబుతున్నారు. కడప జిల్లా నుంచి కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, కర్నూలు జిల్లా నుంచి టిజి భరత్, మైనార్టీ కోటాలో ఎన్‌ఎండి ఫరూక్, కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పేర్లు వినిపిస్తున్నాయి. అనంతపురం జిల్లా నుంచి ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత రేసులో ఉన్నారు. చిత్తూరు నుంచి పలమనేరు ఎమ్మెల్యే ఎన్ అమర్‌నాథ్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. పిఠాపురం సీటు జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు త్యాగం చేసిన వర్మకు ఎమ్మెల్సీ ఇచ్చే అవకాశం ఉంది. కూటమిలో మిత్రపక్షాలైన జనసేన, బిజెపి పార్టీల నుంచి కూడా మంత్రి పదవులు కోరుతున్న ఆశావహులు ఎక్కువగానే ఉన్నారు. జనసేన నుంచి తెనాలి నుంచి గెలిచిన ఆ పార్టీ పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్, అనకాపల్లి నుంచి గెలిచిన మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్, నిడదవోలు ఎమ్మెల్యే కందుల దుర్గేష్, రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ పేర్లు వినిపిస్తున్నాయి. బిజెపి నుంచి విజయవాడ పశ్చిమ నుంచి గెలిచిన సుజనా చౌదరి, అనంతపురం జిల్లా ధర్మవరం నుంచి గెలిచిన సత్యకుమార్, జమ్మలమడుగు నుంచి గెలిచిన ఆదినారాయణ రెడ్డి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావు, విశాఖపట్నం ఉత్తరం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పేర్లు వినిపిస్తున్నాయి. యితే జిల్లాల వారీగా కాకుండా అనుభవం, అర్హతలను బట్టి మంత్రి పదవులు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ క్రమంలో కొందరిని నిర్దయగా పక్కన పెట్టాల్సి ఉంటుంది. ఎపి పునర్నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగాల్సి ఉన్న క్రమంలో మంత్రి పదవులు పెద్దగా పట్టింపు కారాదు.

# ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం



విజయనగరం,ఏపీలో వైసీపీ ఘోర పరాజయం తర్వాత.. ఓడిపోయిన ఆ పార్టీ అభ్యర్థులు ఒక్కొక్కరు మీడియా ముందుకు వస్తున్నారు. తాజాగా మాజీమంత్రి బొత్స సత్యనారాయణ వైసీపీ ఓటమిపై స్పందించారు. ప్రజాతీర్పును గౌరవిస్తున్నామని తెలిపారు. ఇదే సమయంలో వైసీపీ ఘోర ఓటమికి పార్టీ విధానాలే కారణమని ఒప్పుకున్నారు. అంటే జగన్ ఏకపక్ష నిర్ణయాలతో పాటు.. ఎమ్మెల్యేల కు విలువ ఇవ్వకపోవడం, ప్రతిపక్ష నాయకులను వేధించడం వంటి నిర్ణయాలే తమ ఓటమికి కారణమని బొత్స సత్యనారాయణ పరోక్షంగా చెప్పకనే చెప్పినట్లైంది. వైసీపీ విధానాలు నచ్చకనే ప్రజలు ఇలాంటి తీర్పు ఇచ్చారని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. ప్రజాపాలన అందిచమని వైసీపీకి గతంలో అధికారం ఇస్తే.. ప్రజల అభిప్రాయానికి భిన్నంగా వ్యవహరించడంతోనే వైసీపీ అభ్యర్థులను ఓడించారని మాజీ మంత్రి తెలిపారు. ఓటమికి పార్టీలో ఏ ఒక్కరినో నిందించలేమని.. పార్టీ విధానాలే కారణమన్నారు. మా పార్టీ కంటే కూటమి మెరుగైన పాలన అందిస్తుందని ప్రజలు ఆశించారని.. అందుకే టీడీపీ కూటమిని గెలిపించారని చెప్పారు. పార్టీని మరింతగా క్షేత్రస్థాయిలో బలోపేతం చేసుకునేందుకు ఓ స్పష్టమైన విధానాన్ని ప్రకటిస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రకటించిన మేనిఫెస్టో అమలు కావాలని కోరుకుంటున్నామన్నారు. ఎన్నికల ముందు వరకు వైసీపీ అధినేత జగన్ తీసుకునే ప్రతి నిర్ణయం ఎంతో గొప్పదంటూ బొత్స సత్యనారాయణ సమర్థిస్తూ వచ్చారు. పార్టీలో కీలకనేతగా ఉన్న ఆయన జగన్ ప్రతి నిర్ణయంపై ప్రశంసలు కురిపించారు. ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చినా అధినేత నిర్ణయంపై ఎటువంటి అభ్యంతరం చెప్పేవారు కాదు. జగన్ ఎంతో గొప్పగా పాలన అందిస్తున్నారని కొనియాడారు. అయితే ఎన్నికల ఫలితాల తర్వాత బొత్స సత్యానారాయణ మాట మారిందనే విషయం స్పష్టమవుతోంది. ఓటమికి పార్టీ విధానాలే కారణమని పరోక్షంగా ఓటమి మొత్తానికి జగన్మోహన్ రెడ్డి వైఖరి కారణమంటూ చెప్పారు. దీంతో ఫలితాల తర్వాత బొత్స సత్యనారాయణ మాట మార్చారనే చర్చ జరుగుతోంది. బొత్స సత్యనారాయణ వ్యాఖ్యల తర్వాత ఆయన వైసీపీని వీడి కాంగ్రెస్‌లో చేరతారా అనే చర్చ జరుగుతోంది. వైసీపీ ఈ ఎన్నికల్లో తుడిచిపెట్టుకుపోవడంతో.. ఆ పార్టీలో ఉండి రాజకీయాలు చేయలేమనే ఆలోచనలో బొత్స ఉన్నట్లు తెలుస్తోంది. రెండు, మూడు నెలల తర్వాత తన అనుచరులతో చర్చించి కాంగ్రెస్‌లో చేరవచ్చనే చర్చ నడుస్తోంది. బొత్స రాజకీయంగా ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది వేచిచూడాల్సి ఉంది.

# పత్తి సాగుకే రైతులు ఆసక్తి..తొలకరి కోసం ఎదురు చూపులు



ఆదిలాబాద్, ఈ ఏడాది పత్తి పంట సాగు వైపే రైతులు మళ్లీ పరుగులు తీస్తున్నారు. గత అనుభవంతోనే ఈసారి పత్తి పంటను సాగు చేసేందుకు రైతులు అధికంగా ఆసక్తి చూపుతున్నారు. అందుకే పత్తి విత్తనాలకు డిమాండ్ పెరుగుతోంది. గత కొన్నేళ్లుగా సంప్రదాయ పంటల సాగుతో రైతులకు భారీ నష్టాలు వస్తున్నాయని భావించిన ప్రభుత్వం గత ఏడాది నుంచి పత్తి పంట సాగును ప్రోత్సహిస్తూ వస్తోంది. దీంతో ప్రత్యామ్నాయ పంటలైన సోయా, కంది పంటల సాగు తగ్గుతూ వస్తోంది. పంట చేతికి వచ్చే సమయంలో సోయా, కంది పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతూ లబోదిబో మంటున్నారు. ఇలాంటి పరిస్థితు ల్లో ఈ ఏడాది పత్తి పంటనే సా గు చేసేందుకు జిల్లా రైతులు అ ధికంగా ఆసక్తి చూపుతున్నారు. అయితే అధికారులు భావిస్తున్నట్లుగా మిశ్రమ పంటల సాగు విస్తీర్ణం తగ్గి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం కనిపిస్తుంది. అంచనాలకు మించిన ధరలుఅంతర్జాతీయ మార్కెట్‌లో ధరల ఎచ్చుతగ్గుల కారణంగా పత్తి పంటకు ధరలు ఉండవని ప్రచారం జరిగినప్పటికీ గతేడు పత్తి పంటల ధరలు అంచనాలకు మించి ధర పలికింది. పంట చేతికి వచ్చినప్పటి నుంచి కొనుగోలు ముగిసే వరకు మద్దతు ధరను మించిన ధరలేదక్కాయి. తెల్ల బంగారం సిరులు కురిపించడంతో ఈ సారి కూడా రైతులు పత్తి పంటపై భారీ ఆశలు పెట్టుకుంటున్నారు. దీంతో ఈ ఖరీఫ్‌లో జిల్లాలో 20వేల ఎకరాలకు పై గా పత్తి పంట సాగు విస్తీర్ణం పెరిగిందని అధికారులే చెబుతున్నారు. ఇప్పటికే రైతులు విత్తనాలను కొనుగోలు చేసి తొలకరి వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. వర్షాధార పంటగా సాగయ్యే పత్తికి జిల్లా వాతావరణం అనుకూలంగా ఉండడంతో పాటు నల్లరేగడి భూముల్లో అధిక దిగుబడులు రావడమే అసలు కారణమని రైతులు చెబుతున్నారు. అధికారులు మాత్రం మిశ్రమ పంటలను సాగు చేస్తేనే మంచి ఫలితా లు వస్తాయని సూచిస్తున్నారు. రైతులు స్వయంగా పత్తి పంటను సాగు చేసిన అనుభవంతోనే ముందుకు సాగుతున్నారు. తొలకరి వర్షాలకే పత్తి పంటను విత్తుతే చీడ పీడల నుంచి తట్టుకుని అధిక దిగుబడులు వస్తాయని పేర్కొంటున్నారు. వాణిజ్య పంటగా పత్తి పంటతో అప్పులు తీరే అవకాశం ఉందని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఒక ఏడాది నష్టం వచ్చిన మరో ఏడాది ఆదుకోకపోతుందా అనే భావనతో పత్తి పంటను సాగు చేసేందుకు రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. అయితే ధరలు భాగానే ఉన్న పెట్టుబడి ఖర్చులు మరింతగా పెరిగి పోవడంతో లాభాలు అంతంత మాత్రంగానే వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. జిల్లా సాగు భూమి విస్తీర్ణం 5 లక్ష ల 71 వేల ఎకరాలు కాగా ఈ సారి 3లక్షల 95వేల 200 ఎకరాలలో పత్తిపంట సాగయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఖరీఫ్ పంటల సాగుకు వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. గతేడా కంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం గణనీయం గా పెరుగనుంది. మూడు నాలుగేళ్లుగా విస్తీర్ణం తగ్గినా గత ఏడాది ధరలు పుంజుకోవడంతో ఈసారి సాగుపై రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.

# మోదీ, షా స్టాక్ కుంభకోణం: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ,స్వతంత్ర భారతంలో అతిపెద్ద స్టాక్ మార్కెట్ కుంభకోణం జరిగింది కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురువారం అన్నారు. దీని వెనుక ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు విడుదలైన మంగళవారం (జూన్ 4న) దేశీయ స్టాక్ మార్కెట్లు అత్యంత భారీ నష్టాలను చవిచూసిన విషయం తెలిసిందే. అయితే దీన్నో భారీ స్కామ్‌గా రాహుల్ అన్నారు. జైంట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) దర్యాప్తు జరుపాలని డిమాండ్ చేశారు. నిజానిజాలు తేలాలంటే విచారణ జరిగి తీరాల్సిందేనన్నారు.

చిన్న మదుపరులకు పెద్ద నష్టం

ఇటీవలి స్టాక్ మార్కెట్ల నష్టాలు.. చిన్న మదుపరులకు పెద్ద నష్టాలు మిగిల్చాయని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితాలకు ముందు అమిత్ షా, మోదీ.. ఈసారి కూడా అధికారంలోకి వచ్చేది తామేనని, జూన్ 4న స్టాక్ మార్కెట్లు భారీ లాభాలను అందుకుంటాయని, మదుపరులు స్టాక్స్‌ను పెద్ద ఎత్తున కొనాలంటూ సలహాలిచ్చారని గుర్తుచేశారు. ఈ సందర్భంగానే 5 కోట్ల రిటైల్ మదుపరులు తమ కష్టార్జితాన్ని కోల్పోయారని ఇక్కడ విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఆ ఒక్కరోజే మదుపరుల సంపద రూ. 31 లక్షల కోట్లు పడిపోయిందని చెప్పారు. 'స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టాలని మదుపరులకు ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎందుకు సలహా ఇచ్చారు. ఈ రకమైన సలహాలు ఇవ్వడం ఏమైనా వాళ్ల పనా? ఇద్దరూ బిజినెస్ గ్రూప్ (అదానీ గ్రూప్?) నాకు ఒకే మీడియాకు ఇంటర్వ్యూలిస్తూ అంతా పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించారు.

ఎగ్జిట్ పోల్స్ ఫేక్

జూన్ 1న వచ్చిన ఎగ్జిట్ పోల్స్ అన్నీ మోసమని రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. ఇంటెలిజెన్స్ రిపోర్ట్స్ నిర్మాణం మే నెలలో పలుమార్లు అటు అమిత్ షా, ఇటు మోదీ.. విజయం మాదే, ఫలితాల రోజున స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయిలో పరుగులు పెడతాయని ప్రగల్భాలు పలికారని రాహుల్ అన్నారు. దీనివల్ల తమ సన్నిహితుల స్టాక్స్‌కు లాభం చేకూర్చేలా కుట్రకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తొలిసారి ప్రధాని స్టాక్ మార్కెట్ల ప్రస్తావన పదేపదే తెచ్చారని, దాంతో లేని బూమ్ వచ్చింది. .

ఈడీతో విచారణ చేపట్టాలి

జూన్ 4న ఏర్పడ్డ స్టాక్ మార్కెట్ నష్టాలపై ఈడీతో దర్యాప్తు చేపట్టాలని ఆర్థిక



వ్యవహారాల కార్యదర్శి అజిత్ సేథ్‌కు రాసిన లేఖలో మాజీ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ డిమాండ్ చేశారు. ఈ భారీ నష్టాలతో చిన్న మదుపరులు కుదేలయ్యారని, ఇప్పటికీ పూర్తి స్థాయిలో ఆ రోజు నష్టాలు రికవరీ కాకు అందించబడ్డాయి. దీని వెనుక ఉన్న కారణాలు తెలియాలన్నారు.

సెబీతో దర్యాప్తు చేయాలి

అక్రమ పద్ధతిలో స్టాక్ మార్కెట్లను ప్రభావితం చేసేలా వచ్చిన ఎగ్జిట్ పోల్స్‌పై మార్కెట్ రెగ్యులేటర్ సెబీ విచారణ జరుపాలని అఖిల భారత తృణమూల్ కాంగ్రెస్ (టీసీఐ) డిమాండ్ చేసింది. ఈ ఎగ్జిట్ పోల్స్ అంచనాలతోనే జూన్ 3న మదుపరులు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టారని, జూన్ 4న నష్టపోయారని సెబీకి రాసిన లేఖలో టీఈసీ నేత సాకేత్ గోఖలే సమాచారం.

## సికింద్రాబాద్‌లో పల్టీలు కొట్టిన కారు...

హైదరాబాద్, సికింద్రాబాద్ క్లబ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో కారులోని ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. గురువారం సికింద్రాబాద్ క్లబ్ వద్ద రెడ్ సిగ్నల్ పడింది. ఆ తొందరలో డ్రైవర్.. కారును వేగంగా ముందుకు నడిపారు. అయితే మరోవైపు గ్రీన్ సిగ్నల్ పడడంతో మరో కారు ముందుకు వచ్చింది. దీంతో వేగంగా వచ్చిన కారు.. అడ్డు వచ్చిన కారును వేగంగా ఢీ కొట్టింది. దాంతో కారు మూడు పల్టీలు కొట్టి.. డివైడర్ల మీదగా పక్కకు పడిపోయింది. అక్కడే ఉన్న ట్రాఫిక్ పోలీసులు, వాహనాదారులు వెంటనే స్పందించి.. కారులోని ప్రయాణికులకు బయటకు తీశారు. ఇక ఈ ప్రమాదంలో రెండు కార్లు ధ్వంసమైనాయి.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com